

2023 మ్యుటేషన్ ఆమోదించినట్టు, ఒకే పేరుతో ఒక ఖాతాలో పలు సర్వే నంబర్లతో భూ హక్కులు మార్చేసిన చిత్రం



భూ మాయ.. ఒకటి రెండు కాదు.. రూ.కోట్లు విలువైన 223.37 ఎకరాలను రాసేశారు. అక్షరాలా రూ.వెయ్యి కోట్లకుపైగా విలువైన భూమి హక్కుదారులు ఐదుగురే. ఐదుగురి పేర్లపైకి మార్చేసిన ఈ భూమి మొత్తం పొన్నూరు అర్బన్ పరిధిలోది కావడం భూ యజమానులను కలవరపరుస్తోన్నది. 60 నుంచి 70కిపైగా సర్వే నంబర్లలోని అర సెంటు నుంచి ఎకరాలకు ఎకరాలు భూమిని కేవలం ఐదుగురు పేరుపై మార్చేశారు. వారి పేర్లు కూడా గందరగోళమే. అసలు వారెవ్వరు.. వారున్నారా అంటే అనుమానమే. కొందరు భూ యజమానుల పరిశీలనలో వెలుగుచూసిన ఈ భూమాయ గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగింది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత కూడా మ్యుటేషన్లు జరగడం చూస్తే ఇందులో పెద్దల హస్తం ఉన్నట్లు తెలుస్తోంది. రెండు ఖాతాలను ఎప్పుడు మ్యుటేషన్ చేశారనేది చూపకున్నా, మిగిలిన మూడు ఖాతాలను 2023, 2024 సంవత్సరాల్లోనే మ్యుటేషన్ చేశారు. దీనిని బట్టి ఏదైనా భారీ కుంభకోణానికి స్కెచ్ వేశారా అనే అనుమానాలు వస్తున్నాయి.

ఐదుగురికి.. రూ. 1000 కోట్ల భూములు

- 70కిపైగా సర్వే నంబర్లు.. 223 ఎకరాలు
- పొన్నూరు పట్టణ పరిధిలో భూ మాయ
- 2023, 2024లో మూడు ఖాతాల మ్యుటేషన్
- గత వైసీపీ హయాంలో భారీ భూ కుంభకోణం
- పేరు మార్చి అమ్మేశారా.. తాకట్టు పెట్టి కోట్లు దోచేశారా?

తెనాలి, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఒకటి కాదు... రెండు కాదు... అక్షరాలా రూ.వెయ్యి కోట్లకుపైగా విలువైన భూములవి. మొత్తం 223.37 ఎకరాలను భూములకు ఐదుగురిని హక్కుదారులను చేసేశారు. పేరు మారిన భూములు క్రయవిక్రయాల ద్వారా చేతులు మారాయా? లేక మరేదైనా కుంభకోణానికి ఉపయోగించుకున్నారా! అనేది అంతుబట్టని విషయం. వైసీపీ నేతల్లో ఎవరైనా పావులు కదిపి తమకు తెలిసిన వ్యక్తుల పేర్లపై భూములను మార్పిడి చేయించి, వాటిని అమ్మేశారా? లేక తాకట్టుపెట్టి రూ.కోట్లు దోచేశారా! అనే సందేహాలకూ సమాధానం దొరకని పరిస్థితి. ఇంతటి భారీ భూ మాయపై అధికారులే గుట్టు విప్పాల్సి ఉంది. రెవెన్యూ ఖాతా ఒకటే దానిలో ఉన్న సర్వే నంబర్లు మాత్రం 70కిపైనే. భూములు కూడా ఒక్కొక్కరి పేరుపై 50 ఎకరాలకుపైనే కట్టబెట్టారు. ఇది ఏ పల్లెటూరులోనో, మారుమూల గ్రామాలకు సంబంధించినదైతే పర్వాలేదు. పొన్నూరు పట్టణ పరిధిలోని భూములు కావడం, వాటి విలువ లెక్కిస్తేనే కళ్లు తిరిగే పరిస్థితి. ఒకరి పేరుపై 60 ఎకరాలుంటే, దానిలో ఎకరాకు మంచిన భూమి 10 నుంచి 20 ఎకరాల వరకే ఉంది. మిగిలిన సర్వే నంబర్లలోనివన్నీ సెంట్లు, గజాల లెక్కనే ఉన్నాయి. అంటే పట్టణంలో సెంటు భూమి కనీసం రూ.12 లక్షల నుంచి రూ.25 లక్షల వరకు ఉంది. అంటే పది సెంట్ల భూమి ఉందంటే అతను కోటీశ్వరుడి కింద లెక్కే. ఇంతటి విలువైన భూములు కేవలం ఐదుగురు వ్యక్తుల పేర్లపై మార్చడం ఆందోళన కలిగిస్తున్న అంశం. 5001 నుంచి 5005 వరకు ఖాతా నంబర్లను పూర్తిగా ఐదుగురు వ్యక్తులకు కేటాయించారు. ఒకవేళ ఆ ఖాతాలో ఏదో ఒక సర్వే నంబర్‌కు సంబంధించిన హక్కుదారుడి పేరు ఉంటుందనుకున్నా, ఒకరిపేరుపైనే అంత భూమిని ఎక్కించకూడదు. కానీ ఇక్కడ ఎకరాలకు ఎకరాలు అప్పనంగా మార్చేశారు. పట్టణంలో పది సెంట్ల భూమి రూ.2 కోట్లకుపైగా ఉంటే, పట్టణ శివార్లలో ఉన్న పొలం కూడా ఎకరా రూ.1.5 కోట్ల నుంచి రూ.3 కోట్ల వరకు పలుకుతోంది. ఈ ప్రకారం లెక్కించినా 223 ఎకరాల భూమి విలువ రూ.వెయ్యికోట్లపైనే ఉంటుందనేది ఒక అంచనా.

భూ కుంభకోణమనేందుకు అనుమానాలు..

- వరుస ఖాతా నంబర్లలో వందల ఎకరాల భూమి పేర్లు మారిపోవడం చూస్తే పొరపాటు కాదనేది అర్థమవుతున్నది.
- ఐదుగురు వ్యక్తులను ఎంపిక చేసుకుని వైసీపీ ప్రభుత్వంలోని పెద్దలుకానీ, ఇతర నేతలెవరయినా భారీగా రుణ కుంభకోణానికి పాల్పడి

(మిగతా 8వ పేజీలో..)

వారెవరు.. అదెలా సాధ్యం ?

- పొన్నూరు అర్బన్ పరిధిలో 5001, 5002, 5003, 5004, 5005 ఖాతా నంబర్ల కింద ఐదుగురు పేర్లు ప్రస్తావించారు.
- 5001 ఖాతా నంబరులో పట్టాదారుడి పేరుగా అమరావతి లోకనందం అని తండ్రి లేదా భర్త పేరు అమరావతి అని ఉంది. ఇక్కడ ఆ వ్యక్తి ఇంటి పేరు తండ్రి లేదా భర్త పేరు ఒకటిగానే చూపారు. ఈ ఖాతాలో ఆ పేరున 72 సర్వే నంబర్లు చూపి, 45.7641 ఎకరాల భూమికి హక్కుదారుడిగా చూపారు. వీటి మ్యుటేషన్ 2023 ఆగస్టు 5న ఆమోదించినట్లు చూపారు. 326 సర్వే నంబరులో 5.59 ఎకరాలు, 250-6 సర్వే నంబరులో 2.89 ఎకరాలు చూపారు.
- 5002లో పట్టాదారుగా వెలగపూడి నారాయణగౌడ్ అని ఉంది. ఖాతాలో 76 సర్వే నంబర్లు కేటాయించి 61.1325 ఎకరాల భూమి ఉన్నట్లు చూపారు. 221-1బీలో మెట్ట భూమి 25 ఎకరాలున్నట్లుచూపారు.
- 5003 ఖాతాలో నిడుబ్రోలు సితార, భర్త నిడుబ్రోలు పేరుతో 77 సర్వే నంబర్లు నమోదై ఉన్నాయి. 42.285 ఎకరాల భూమిపై సితారకు హక్కు చూపారు. 154-5 సర్వే నంబరులోని 12 సెంట్ల భూమికి సంబంధించి మ్యుటేషన్ 2024 మార్చి 12న ఆమోదించినట్లు చూపారు. మిగిలిన నంబర్ల మ్యుటేషన్ ఆమోదించిన కాలమ్‌ను ఖాళీగా వదిలేశారు.
- 5004 ఖాతా నంబరులో గుంటూరు స్వేహారెడ్డి, భర్త గుంటూరు పేరుతో 68 సర్వే నంబర్ల కింద 35.5775 ఎకరాల భూమి ఉన్నట్లు చూపారు. ఈ ఖాతాకు సంబంధించి భూమి ఎలా సంక్రమించిందనే కాలం, మ్యుటేషన్ కాలమ్‌లను ఖాళీగా వదిలేశారు.
- 5005 ఖాతా నంబరులో అమరావతి నవనీతం, భర్త అమరావతి పేరుతో 76 సర్వే నంబర్లు కేటాయించారు. వీటిలో మొత్తం 38.6162 ఎకరాల భూమి సంక్రమించినట్లు ఉంది. ఈ ఖాతాకు సంబంధించి అన్ని సర్వే నంబర్లు 2024 అక్టోబరు 19 తేదీతో మ్యుటేషన్ ఆమోదించినట్లు చూపారు.

హక్కుదారులొస్తే మారుస్తారంట

2023లో మ్యుటేషన్ అయినట్లు రికార్డుల్లో చూపిస్తుంది. అయితే అవన్నీ 2016లోనే జరిగినట్లు అధికారులు బుకాయిస్తున్నారు. మరో అడుగు ముందుకువేసి... అవన్నీ నోషనల్ ఖాతాలని, హక్కుదారులు అందుబాటులో లేకపోయినా, ఎవరైనా కచ్చితమైన డాక్యుమెంట్లు చూపకపోయినా అటువంటి ఖాతాల్లోకి మార్చుతామని, హక్కుదారులు వచ్చి మళ్లీ దరఖాస్తు చేసుకుంటే మార్చుతున్నామని చెప్పుకొస్తున్నారు.

కూటమి ప్రభుత్వంలోనూ మార్పులు

ఎన్నికలు పూర్తయి, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా మ్యూటేషన్‌లో మార్పులు జరిగాయి. ఎక్కువ శాతం భూమి 2023 సంవత్సరంలో మారింది. కొన్ని ఈ సంవత్సరం మే, అక్టోబరు, నవంబరు నెలల్లో కూడా ఆమోదించినట్లు నమోదు చేశారు. దీనినిబట్టి ఎవరైనా బలమైన వ్యక్తుల ప్రమేయం ఉందా అనేది అంతుబట్టని విషయం. అయితే ఈ ఐదు ఖాతా నంబర్లలో పట్టాదారులుగా చూపిన ఐదుగురు ఎవరనేది తేలాల్సి ఉంది.

- ప్రముఖ కంపెనీల పేరుతో నకిలీలు
- జీ-2 లైసెన్స్ లేకుండా తయారీ
- గుంటూరు శివారు గ్రామాల్లో యథేచ్ఛగా అమ్మకాలు
- వినుకొండ అడ్రస్‌తో రైతులకు అంటగడుతున్న బిల్లులు

నకిలీ బయోలు

గుంటూరు సిటీ, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ కంపెనీల పేరుతో.. వారు కూడా గుర్తించనట్లుగా పురుగు మందులు, బయో ఉత్పత్తులు మార్కెట్‌లో విక్రయాలు జరుగుతున్నాయి. నకిలీ బయో మందులు, పురుగు మందుల అమ్మకాలు గుంటూరులో జోరుగా సాగుతున్నాయి. నకిలీ పురుగు మందులు, బయో ఉత్పత్తులు రైతులను నిండా ముంచేస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడంపై అనుమానాలు వస్తున్నాయి. జీ-2 అనుమతి కూడా లేకుండానే బయో ఉత్పత్తుల తయారీ.. అమ్మకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. ఈ మధ్య కాలంలో కొందరు రైతులు బయో ఉత్పత్తులు, పురుగు మందుల కోసం గుంటూరు రూరల్ మండలం ఓబుల్‌నాయుడుపాలెం, యనమదల, నాయుడుపేటలోని జగనన్న కాలనీకి పెద్దసంఖ్యలో వస్తున్నారు. ఆరా తీస్తే పల్నాడు జిల్లా వినుకొండ అడ్రస్‌తో హిమాలయ అగ్రిటెక్ పేరుతో బిల్లులు ముద్రించి ఇక్కడ విక్రయాలు జరుపుతున్నట్లు తేలింది. వినుకొండ ప్రాంతానికి చెందిన నకిలీ బయోల మాఫియా నాలుగు నెలలుగా గుంటూరు రూరల్ మండలంలో మకాం వేసి నకిలీ బయోలు అమ్ముతున్నట్లు తెలిసింది. వారు రైతులకు ఇస్తున్న బిల్లుల ఆధారంగా పరిశీలిస్తే అవి నకిలీవని తేలింది. ఆ పేరుతో బయో ఉత్పత్తుల అమ్మకాలకు అవసరమైన జీ-2 అనుమతి లేదని తెలుస్తోంది. కేవలం రైతులను నమ్మించేందుకు బిల్లులు తయారు చేసి విక్రయాలు జరుపుతున్నట్లు తెలుస్తోంది.

తక్కువ ధరని రైతులకు గాలం..

గతంలో ప్రముఖ పురుగు మందుల కంపెనీల్లో పనిచేసిన కొందరు వ్యక్తులను ఉద్యోగులుగా చేర్చుకుని గుంటూరు శివారులో నకిలీ బయోల వ్యాపారం చేస్తున్నట్లు తెలుస్తుంది. తక్కువ ధరకే మంచి పురుగు మందులు లభ్యం అవుతున్నాయని చెప్పి రైతులను ఆకర్షిస్తున్నారు. రైతులు ఆయా ప్రాంతాల నుంచి గుంటూరు మార్కెట్ సెంటర్‌కి వస్తే నకిలీ కంపెనీకి చెందిన వ్యక్తులే ఆటోలు ఏర్పాటు చేసి వ్యాపార స్థావరానికి తీసుకుపోతున్నారు. రోజుకు 70 నుంచి 80 మంది రైతులను ఈ విధంగా తీసుకువచ్చి నకిలీ మందులు అంటగడుతున్నారు. ఈ విధంగా రోజుకు రూ.7 లక్షల నుంచి రూ.10లక్షల వరకు నకిలీ బయోలు, పురుగు మందులు అమ్మకాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇదే వ్యక్తులు ప్రముఖ కంపెనీల పేరుతో నకిలీ మందులను విక్రయిస్తున్నారు. గోద్రెజ్ కంపెనీకి చెందిన గ్రాసియా పురుగుమందు పేరుతో నకిలీలను రైతులకు అంటగడుతున్నారు. బీఎస్ఎఫ్‌కు చెందిన ఎక్సోనస్, బేయర్ కంపెనీకి చెందిన కొన్ని పురుగు మందులను కూడా తయారు చేసి అమ్మకాలు చేస్తున్నట్లు సమాచారం. కొందరు రైతులు తక్కువ ధరకు వస్తున్నాయని ఆయా మందులను కొనుగోలు చేస్తున్నట్లు తెలుస్తోంది. అవి పని చేయకపోవడంతో రైతులు వచ్చి ఘర్షణలు పడి పోలీసులకు ఫిర్యాదు చేస్తామని బెదిరించడంతో నగదు వెనక్కి ఇచ్చినట్లు తెలుస్తోంది.

తెలంగాణ నుంచి తెచ్చి..

తెలంగాణ నుంచి ముడి పదార్థాలను తీసుకువచ్చి బయో ఉత్పత్తులను తయారు చేసి విక్రయాలు జరుపుతున్నట్లు సమాచారం. ఇదే వ్యక్తులు అటు పల్నాడులోనూ గతంలో ఇదే రీతిలో నకిలీ మందులు భారీగా విక్రయించినట్లు తెలుస్తోంది. ఇటీవల అక్కడ దొరికిన నకిలీ బయోల డంప్ వ్యవహారంతో గుంటూరు ముఠాకు సంబంధాలు ఉన్నట్లు సమాచారం. అక్కడ దాడులు జరగడంతో ఇక్కడకు మకాం మార్చినట్లు ప్రచారం జరుగుతోంది.



పురుగు మందుల కంపెనీ పేరుతో ముద్రించిన నకిలీ ప్యాక్

ఎవరీ 'బాలు'

గుంటూరు శివారు గ్రామాల్లో ఇబ్బడిముబ్బడిగా నకిలీ బయో ఉత్పత్తులు అమ్మకాలు జరుపుతున్న వ్యవహారంలో బాలు అనే వ్యక్తి కీలకంగా ఉన్నట్లు సమాచారం. రైతులను అక్కడకు తీసుకెళ్లే మధ్యవర్తులు ఆ పేరునే ఎక్కువగా వినియోగిస్తున్నారు. అయితే సదరు వ్యక్తులు రైతులకు ఇస్తున్న బిల్లు మీద యజమాని స్థానంలో ఎవరి పేరు లేదు.

నిఘా ఉంచాం.. ఎవర్నీ వదలం

నకిలీ బయో ఉత్పత్తులకు ఎటువంటి అనుమతి లేకుండా కొందరు గుంటూరు శివారు గ్రామాల్లో విక్రయిస్తున్నారన్న వ్యవహారంపై నిఘా ఉంచాం. ఆయా గ్రామాల్లో ఉన్న వ్యవసాయ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించాం. నకిలీల వ్యవహారంలో ఎవరున్నా వదిలిపెట్టే ప్రసక్తే లేదు.

\- నున్న వెంకటేశ్వర్లు, జిల్లా వ్యవసాయ అధికారి, గుంటూరు

- జనవరి పింఛన్ ఈ నెల 31నే పంపిణీ
- 30న బ్యాంకుల నుంచి నగదు డ్రాకు ఆదేశాలు
- యలమందలలో పంపిణీ చేయనున్న సీఎం చంద్రబాబు

మూడో నెలా.. ముందస్తుగానే

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ప్రతీ నెల ఒకటో తేదీన సామాజిక పింఛన్లను లబ్ధిదారులకు అందివ్వాలని లక్ష్యంగా పెట్టుకున్న కూటమి ప్రభుత్వం ప్రతీ నెల రికార్డులను అధిగమిస్తోంది. ఈ క్రమంలో ఒకటో తేదీ సెలవు దినమైతే ఆ తర్వాత రోజు కాకుండా ముందు రోజే పింఛన్ల నగదు అందజేస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఆరు నెలలు పూర్తి అయి ఏడో నెల సమీపిస్తున్నది. అయితే ఇప్పటికి ఆరు నెలలు కూటమి ప్రభుత్వ నేతృత్వంలో పింఛన్లు పంపిణీ జరగ్గా జనవరి ఏడో నెల అవుతుంది. ఈ క్రమంలో ఒకటో తేదీ కంటే ముందుగానే ఇప్పటికి మూడు నెలలు పింఛన్ల పంపిణీ జరిగింది. సెప్టెంబరు 1 ఆదివారం కావడంతో ఆగస్టు 31న, డిసెంబరు 1 ఆదివారం కావడంతో నవంబరు 30న పింఛన్ల పంపిణీ జరిగింది. కొత్త సంవత్సరం జనవరి 1 కావడంతో ఒక రోజు ముందు డిసెంబరు 31నే పింఛన్ల పంపిణీకి ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ క్రమంలో జిల్లా అధికారులు పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్నారు. పింఛన్ల పంపిణీ 31న చేయాలంటే ఒక రోజు ముందుగానే పంచాయతీలు, మున్సిపాల్టీల వారీగా నగదును బ్యాంకుల నుంచి డ్రా చేయాలి. ఈ ప్రక్రియను ఈ సారి 30న చేపట్టనున్నారు. 31న మంగళవారం పింఛన్లు పంపిణీకి అధికార యంత్రాంగం సమాయత్తమవుతోంది.

95 శాతానికి పైగానే పంపిణీ..

వలంటీర్లు లేకుండా ఇంటింటా పింఛన్ పంపిణీ సాధ్యం కాదనే గత వైసీపీ ప్రభుత్వ వాదనను కూటమి ప్రభుత్వం అధిగమించింది. అందుబాటులో ఉన్న సచివాలయ సిబ్బందితోనే ప్రతీ నెల ఒక్క రోజులోనే 95 శాతానికిపైగా పింఛన్లను అందించగలిగింది. పల్నాడు జిల్లాలో 2,74,209 మంది పింఛన్‌దారులు ఉన్నారు. బాపట్ల జిల్లాలో 2,28,615, గుంటూరు జిల్లాలో 2,54,610 మంది పింఛన్‌దారులు ఉన్నారు. ఈ నెలలో పల్నాడు జిల్లాలో 2,71,190(98.9 శాతం) మంది లబ్ధిదారులకు రూ.116,02,90,000, బాపట్ల జిల్లాలో 2,25,788(98.76 శాతం) మందికి రూ.94,28,68,00, గుంటూరు జిల్లాలో 2,51,900(98.94 శాతం) మందికి రూ.107,59,32,00 పంపిణీ చేశారు.

ఏర్పాట్లలో అధికారులు..

ప్రతి నెలా రాష్ట్రంలోని ఏదో ఒక గ్రామంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పింఛన్లు పంపిణీ చేస్తున్నారు. ఈ క్రమంలో ఈ సారి పింఛన్ల పంపిణీని నరసరావుపేట నియోజకవర్గంలోని యలమందలలో చేపట్టనున్నారు. ఇందుకు అధికార యంత్రాంగం విస్తృతంగా ఏర్పాటు చేస్తోంది. ముఖ్యమంత్రి సభకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. హెలిప్యాడ్ నిర్మాణం చురుగ్గా జరుగుతోంది. ఆయా పనులను శుక్రవారం కలెక్టర్ అరుణ్‌బాబు, జేసీ సూరజ్, ఎస్పీ శ్రీనివాసరావు తదితరులు పరిశీలించారు. పనులు వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను వారు ఆదేశించారు.



యలమందలలో సీఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ శ్రీనివాసరావు, జేసీ సూరజ్

నేటి నుంచి పల్నాడు బాలోత్సవం

- రెండ్రోజులు నిర్వహణ.. ఏర్పాట్లు పూర్తి

నరసరావుపేట కల్చరల్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): పల్నాడు బాలోత్సవానికి నరసరావుపేటలోని పీఎన్‌సీ అండ్ కేఆర్ కళాశాల సిద్ధమైంది. శనివారం నుంచి రెండురోజులు జరిగే ఈ కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు బాలోత్సవ కమిటీ ప్రధాన కార్యదర్శి కట్టా కోటేశ్వరరావు శుక్రవారం తెలిపారు. ఈ బాలోత్సవానికి జిల్లా వ్యాప్తంగా 200 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల నుంచి సుమారు 10 వేల మందికిపైగా విద్యార్థులు హాజరవుతారని 65 అంశాల్లో పోటీలు ఉంటాయన్నారు. శాస్త్రీయ, జానపద నృత్యాలతో పాటు బుర్రకథలు, మట్టి బొమ్మలు, ఏకపాత్రాభినయాలు తదితర అంశాల్లో పోటీలు ఉంటాయని చెప్పారు. సమావేశంలో కమిటీ గౌరవాధ్యక్షుడు ఎమ్మెస్ ఆర్కే ప్రసాద్, అధ్యక్షుడు చిలకల రాజగోపాల రెడ్డి, కోశాధికారి కోయా రామారావు, షేక్ మహమ్మద్‌గౌస్, కమిటీ బాధ్యులు మేడా సాంబశివరావు, ఎ.భాగేశ్వరీ దేవి, యన్.వెంకట్, జి.శ్రీనివాసరావు, పి.బాలాజీ, యస్.శివశంకర్, షేక్ అబ్దుల్‌సత్తార్, యస్.రమేష్ పాల్గొన్నారు.



జానపద నృత్య వేషధారణలో చిన్నారులు

శుశ్రుతహాల్‌లో సదరం సర్టిఫికెట్ల జారీ కేంద్రం

గుంటూరు మెడికల్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ భరోసా పథకం కింద రూ.15 వేలు పింఛన్ కోసం దరఖాస్తు చేసుకొనే దివ్యాంగుల కోసం ప్రభుత్వ సమగ్రాస్పత్రి శుశ్రుతహాల్‌లో సదరం సర్టిఫికెట్ల జారీ కేంద్రం ఏర్పాటు చేసినట్లు సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఇప్పటి వరకు దివ్యాంగులు సదరం సర్టిఫికెట్ల కోసం ప్రభుత్వ సమగ్రాస్పత్రిలో పలు కేంద్రాలకు వెళ్లాల్సి వస్తోందని వివరించారు. ఇది వారికి ఇబ్బందికరంగా మారినట్లు తమ దృష్టికి రావడంతో వీరి కోసం శుశ్రుతహాల్‌లో ఒన్ స్టాప్ సెంటర్ ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. శుశ్రుతహాల్ దగ్గర వీరి కోసం వీల్ చైర్లు, ఇతర సౌకర్యాలు కల్పించామన్నారు. అక్కడే దివ్యాంగులకు ఓపీ టిక్కెట్లు జారీ చేయడంతో పాటు దరఖాస్తు పూర్తి చేయించి వైద్య పరీక్షలు, ధ్రువీకరణ పత్రం జారీకి ప్రభుత్వానికి చెల్లించాల్సిన ఫీజును కూడా కట్టించుకుంటారని ఆయన వివరించారు. అనంతరం వివిధ వైద్య విభాగాలకు చెందిన డాక్టర్లు శుశ్రుతహాల్‌కే వచ్చి దివ్యాంగులకు వైద్యపరీక్షలు నిర్వహిస్తారని డాక్టర్ రమణ యశస్వి వెల్లడించారు. బుధవారం న్యూరాలజీ, న్యూరో సర్జరీ, ఆర్థోపెడిక్ సర్టిఫికెట్లు జారీ చేస్తారని, గురువారం కిడ్నీ మార్పిడి ఆపరేషన్ చేయించుకున్న వారికి, శనివారం కాలేయ మార్పిడి ఆపరేషన్ చేయించుకున్న వారికి సర్టిఫికెట్లు జారీ చేస్తామని ఆయన తెలిపారు.

మాదిగ కార్పొరేషన్లో ముగ్గురు జిల్లా వాసులు

గుంటూరు, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ మాదిగ కార్పొరేషన్లో జిల్లాకు చెందిన ముగ్గురు స్థానం పొందారు. మంగళగిరి నియోజకవర్గం నుంచి బేతపూడి విజయ శేఖర్, తాడికొండ నుంచి కమ్మంపాటి శిరీష, మాచర్ల నుంచి సాతులూరి కుమార్‌లు డైరెక్టర్లుగా నియమితులయ్యారు.

జీవో ప్రకారమే కేటాయింపులు

- సీఆర్డీఏ అదనపు కమిషనర్ ప్రవీణ్ చంద్
- గ్రీవెన్స్‌కు పోటెత్తిన గ్రామ కంఠాల సమస్యలు



రైతులతో మాట్లాడుతున్న అదనపు కమిషనర్ ప్రవీణ్ చంద్

తుళ్లూరు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) సీఆర్డీఏ నిర్వహించిన గ్రీవెన్స్ డేకి గ్రామ కంఠాల సమస్యలు పోటెత్తాయి. గతంలో అన్యాయం జరిగిందని రైతులు గ్రీవెన్స్ డేను నిర్వహించిన సీఆర్డీఏ అదనపు కమిషనర్ సూర్య సాయి ప్రవీణ్ చంద్ వద్ద వాపోయారు. ఒక్కొక్కరికి ఒక్కోరకంగా గ్రామ కంఠాలను కేటాయించారని వివరించారు. ఒకే సర్వే నంబర్‌లో పక్క పక్కనే ఉన్నా కాని ఒకరికి పది సెంట్లు కేటాయిస్తే, మరొకరికి ఇరవై సెంట్లు, అర ఎకరం, ఎకరం వరకు కేటాయించటం ఎలా సాధ్యమైందని ప్రశ్నించారు. పశువుల పాకలు, గడ్డి వాములు, గోదాములు, పొగాకు బేరన్‌లు, పశువుల మేతకు వినియోగించే భూమిని, ఇతర నిర్మాణాలు, ఊరికి ఆనుకొని ఉన్న స్థలాలను గ్రామ కంఠాల కింద గత టీడీపీ ప్రభుత్వంలోనే కేటాయింపులు జరిగాయి. గతం గురించి వద్దు, ఇప్పుడు మీ అప్పీలు ఏమిటనేది చెప్పండి, క్షేత్రస్థాయిలో పరిశీలించి ఉన్నతాధికారుల దృష్టిలో ఉంచి జీవో ప్రకారం న్యాయం చేస్తామని అదనపు కమిషనర్ రైతులకు చెప్పారు. క్షేత్ర స్థాయిలో పరిశీలించి గ్రామ కంఠాల సమస్యలు పరిష్కరిస్తామని అదనపు కమిషనర్ గ్రీవెన్స్ డేలో రైతులకు చెప్పారు. కార్యక్రమంలో ల్యాండ్ పూలింగ్ యూనిట్ డిప్యూటీ కలెక్టర్‌లు, తహసీల్దార్‌లు, సామాజిక అభివృద్ధి అధికారి బొర్రా శ్రీనివాసరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పెంచిన టోల్ ఫీజులను ఉపసంహరించుకోవాలి

- కాజ టోల్‌ప్లాజా వద్ద ఆటో వర్కర్ల నిరసన



కాజ టోల్‌ప్లాజా వద్ద నిరసన తెలుపుతున్న ఆటో డ్రైవర్లు, యాజమానులు

మంగళగిరి సిటీ, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): టోల్‌ప్లాజా ఫీజులు దశల వారీగా పెంచుతూ వాహనదారులపై భారాలను మోపుతున్న ప్రభుత్వ చర్యలకు వ్యతిరేకంగా సీఐటీయూ అనుబంధ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం మంగళగిరి మండలం కాజ టోల్ ప్లాజా వద్ద నిరసన తెలిపారు. ఆటో వర్కర్లు, యాజమానులు, డ్రైవర్లు, ఓలా, ఊబర్, ర్యాపిడో వాహనదారులు ర్యాలీగా టోల్‌ప్లాజా వద్దకు చేరుకుని నిరసన తెలియజేశారు. పెంచిన టోల్ ఫీజులను రద్దు చేయాలని, నెల వారీ పాసులను గతంలో మాదిరిగానే జారీ చేయాలని, ఎన్నిమార్లు తిరిగితే అన్నిసార్లు నగదు చెల్లించాలనే కొత్త నిబంధనను ఎత్తివేయాలని, స్థానికులకు పాసులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి ఆర్.లక్ష్మయ్య మాట్లాడుతూ టోల్ ఫీజుల పెంపు వలన వాహన యాజమానులపైనే కాకుండా ప్రజలందరిపైనా ఆ భారం పడుతుందని చెప్పారు. టోల్ ఫీజుల వసూలు దేశంలోనే అతి పెద్ద కుంభకోణంగా అభివర్ణించారు. ప్రతి లీటర్ పెట్రోల్, డీజిల్‌పై 8 శాతం సెస్‌ను కేంద్రం రోడ్డు ట్యాక్స్ పేరుతో వసూలు చేస్తుందని, మళ్లీ టోల్ గేట్ల పేరుతో వసూలు చేయడం ఏమిటని ప్రశ్నించారు. గతంలో ఈ సెల్ రూ.3 వేలు ఉంటే బీజేపీ అధికారంలోకి వచ్చాక రూ.8 వేలకు పెంచిందని, తాజాగా ప్రజలపై మరింత భారాన్ని మోపేలా అక్టోబరు నెల నుంచి ఫీజులను పెంచడాన్ని ఆయన తప్పుబట్టారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు నన్నపనేని శివాజీ, సీఐటీయూ జిల్లా కార్యదర్శి బి.ముత్యాలరావు, ఆటో డ్రైవర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు బి.లక్ష్మణరావు, నేతలు షేక్ మస్తాన్‌వలి, తన్నీరు శ్రీరాములు, గాంధీ రామమోహనరావు, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

31లోపు రైతులు ప్రీమియం చెల్లించాలి

పిడుగురాళ్ల, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): రబీలో రైతులు సాగు చేసిన వివిధ పంటలకు బీమా చెల్లించేందుకు గడువు ఈ నెల 31వ తేదీతో ముగియనున్నది. తొలుత ఈ నెల 15వ తేదీ వరకు ఇచ్చిన గడువు 30వ తేదీ వరకు పొడిగించారు. రైతులు పూర్తి స్థాయిలో బీమా చెల్లించకపోవడంతో గడువు పెంచాలని రైతు సంఘాలు, ప్రజాప్రతినిధుల విన్నపం మేరకు రాష్ట్ర ప్రభుత్వ అభ్యర్థన మేరకు ఈ నెల 31వ తేదీ వరకు గడువు పెంచుతూ కేంద్రం ఉత్తర్వులు జారీ చేసింది. రైతులు సాగు చేస్తున్న పలురకాల పంటలకు బీమా పొందేందుకు మరో నాలుగు రోజులు మాత్రమే సమయం ఉంది. రైతులు త్వరపడాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. పల్నాడులో రబీ సాగులో వరి పంటకు మాత్రమే పంటల బీమా అమలు కానుంది. హెక్టారుకు రూ.1530, ఎకరాకు రూ. 630 రైతు వాటా జమ చేయాలని వాతావరణ ఆధారిత బీమా అధికారులు పేర్కొన్నారు. మిరప, వరి, జొన్న, మినుము, మొక్కజొన్న పంటలు పల్నాడులో సాగులో ఉండగా ప్రస్తుతం రబీ సీజన్‌కు పల్నాడు జిల్లాలో మాత్రం వరి పంటకు మాత్రమే ప్రధాన మంత్రి ఫసల బీమా యోజన పథకం వర్తించనున్నది. దీంతో మిరప, కంది పంటలు సాగుచేసే రైతులకు బీమా వర్తించే అవకాశం లేదు. పంటల బీమా నగదును సమీప మీ-సేవ కేంద్రాల్లో చెల్లించాలి. బ్యాంక్‌లో రుణం తీసుకునే సమయంలో బీమా చేయించుకున్న పంటకు మినహాయింపు ఉంటుంది.

హోంగార్డుపై కానిస్టేబుల్ దాడి

మాచర్లటౌన్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో ఉన్న హోంగార్డుపై ఏపీఎస్పీ కానిస్టేబుల్ విచక్షణా రహితంగా దాడి చేసి గాయపరిచిన సంఘటన బుధవారం రాత్రి మాచర్ల పట్టణంలో చోటుచేసుకుంది. బుధవారం రాత్రి నైట్ బీట్ నిర్వహిస్తున్న హోంగార్డు శ్రీనివాస్ రింగురోడ్డు సెంటర్లో ఉండగా, అదే సమయంలో ఏపీఎస్పీ కానిస్టేబుల్ మల్లికార్జున మద్యం తాగి వచ్చి అకారణంగా దాడికి దిగారు. వద్దని వారిస్తున్నా హోంగార్డు శ్రీనివాస్ విన్నపాన్ని లెక్క చేయకుండా లాఠీతో తల, మెడ, భుజాలు, కాళ్లపై విచక్షణారహితంగా మల్లికార్జున దాడికి పాల్పడ్డారు. మల్లికార్జున స్టేషన్లో ఉండగానే తన సహచరులతో ఘర్షణ పడడంతో వారు నైట్ బీట్‌కు పంపించారు. రింగురోడ్డులో అప్పటికే విధులు నిర్వహిస్తున్న శ్రీనివాస్‌తో ఘర్షణ పడి లాఠీతో ఇష్టానుసారంగా దాడి చేశారు. జరిగిన సంఘటనను కొంతమంది యువకులు వీడియో తీసి సామాజిక మాధ్యమాల్లో పెట్టడంతో వైరల్ అయింది.

ఫెన్సింగ్‌లో రాష్ట్ర స్థాయి ఎంపికలు



రాష్ట్ర పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో డీఎస్‌డీవో నరసింహారెడ్డి

గుంటూరు(తూర్పు), డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక బీఆర్ స్టేడియంలో అండర్-17, బాల, బాలికల విభాగాల్లో ఫెన్సింగ్‌లో రాష్ట్ర స్థాయి ఎంపికలు నిర్వహించారు. ఎంపికలకు దాదాపు 50 మంది క్రీడాకారులు హాజరైయ్యారు. ఎంపికైన క్రీడాకారులు కాకినాడలో శనివారం నుంచి జరిగే ఏపీ అంతర్ జిల్లాల ఫెన్సింగ్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటారని జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ కార్యదర్శి డి.అశోక్‌బాబు తెలిపారు.

- ఎంపికైన క్రీడాకారులు: బాలుర (ఫాయిల్) విభాగంలో.. ఏ.శ్రీనివాసరావు, జోయల్ డేవిడ్, ఏ.సాయిచరణ్, బి.ప్రతాప్‌కుమార్. ఈప్పి విభాగంలో.. ఈశ్వర్ పూర్ణసాయి, బి.తనూజ్, ఆర్.సుశాంత్, ఎం.భార్గవ్. సబార్ విభాగంలో.. ఎస్.కిరణేశ్వర్‌రెడ్డి, బి.ఆదిత్యసాయి, డి.డానియల్ నిహాల్, లియాకత్. బాలికల విభాగంలో.. మున్నీసా.

నేడు వర్సిటీలో పూర్వ విద్యార్థుల సమావేశం

పెదకాకాని, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో శనివారం పూర్వ విద్యార్థుల సంఘం సమావేశం నిర్వహిస్తున్నట్లు పూర్వ విద్యార్థుల సంఘం డైరెక్టర్ ఆచార్య జీవీఎస్ ఆర్ ఆంజనేయులు తెలిపారు. ఉదయం 11 గంటలకు డైక్ మన్ ఆడిటోరియంలో ఈ సమావేశం ప్రారంభమవుతుందని తెలిపారు. సమావేశానికి ముఖ్య అతిథిగా సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్‌వీ రమణ పాల్గొంటున్నారని పేర్కొన్నారు. ఇన్‌చార్జ్ వీసీ ఆచార్య కె.గంగాధరరావు అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి పొన్నూరు శాసనసభ్యుడు ధూళిపాళ్ల నరేంద్ర కుమార్, వర్సిటీ రెక్టార్ ఆచార్య కె.రత్నషీలామణి, రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం, వర్సిటీ పూర్వ విద్యార్థులు హాజరుకానున్నారని పేర్కొన్నారు.

వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి

- జిల్లా ఎస్పీ ఎస్.సతీష్ కుమార్
- ఆటోనగర్ వై జంక్షన్ వద్ద రోడ్డు ప్రమాదాలపై ప్రత్యేక డెమో



డెమో నిర్వహిస్తున్న జిల్లా ఎస్పీ సతీష్ కుమార్, ఏఎస్పీ రమణమూర్తి

పెదకాకాని, గుంటూరు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలనీ, మీ కుటుంబానికి మీ అవసరం చాలా ఉన్నది అన్న విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తు ఎరగాలని జిల్లా ఎస్పీ ఎస్. సతీష్ కుమార్ తెలిపారు. శుక్రవారం పెదకాకాని పోలీస్‌స్టేషన్ ఎదుట ఆటోనగర్ వై జంక్షన్ వద్ద రోడ్డు ప్రమాదాలపై హెల్మెంట్ ఎవర్నెస్ కార్యక్రమాన్ని ఎస్పీ నిర్వహించారు. యమధర్మరాజు, రాక్షసుల వేషధారణలో రోడ్డు ప్రమాదాలపై అవగాహన కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక డెమో నిర్వహించారు. ఎస్పీ సతీష్ కుమార్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్నందున ప్రతి ఒక్కరూ తమ ప్రవర్తన మార్చుకోవాలని సూచించారు. గత ఆరు నెలల్లో జిల్లాలో 1000 పైగా రోడ్డు ప్రమాదం జరిగాయనీ, అందులో 411 మంది మరణించారన్నారు, మిగిలిన వారికి గాయాలు అయ్యాయని తెలిపారు. పెదకాకాని, తాడేపల్లి, గుంటూరు తాలూకా పోలీస్ స్టేషన్లో పరిధిలో ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని వివరించారు. హైవేపై ద్విచక్ర వాహనాలను పూర్తిగా నిషేధిస్తున్నామని తెలిపారు. హెల్మెట్ లేకుండా వాహనం నడిపే వారికి తొలుత వెయ్యి రూపాయలు జరిమానా విధిస్తామని, ఆ తర్వాత కేసులు పెట్టి లైసెన్స్ రద్దు చేస్తామన్నారు. అదనపు ఎస్పీ రమణమూర్తి, మంగళగిరి డీఎస్పీ మురళీకృష్ణ, పెదకాకాని సీఐ నారాయణస్వామి, పెదకాకాని సిబ్బంది పాల్గొన్నారు.

వర్సిటీ ఉద్యోగికి లండన్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్‌లో స్థానం

పెదకాకాని, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): స్కోప్ ఫౌండేషన్ ద్వారా సమాజంలో వివిధ వర్గాల ప్రజలకు అందిస్తున్న సేవలకు గుర్తింపుగా స్కోప్ ఫౌండేషన్ డైరెక్టర్ డాక్టర్ డి.కొండలరావుకు లండన్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో స్థానం లభించింది. ఈ మేరకు శుక్రవారం వర్సిటీ వీసీ చాంబర్లో జరిగిన కార్యక్రమంలో ఇన్‌చార్జ్ వీసీ ఆచార్య కె.గంగాధరరావు, ఇన్‌చార్జ్ రెక్టార్ ఆచార్య కె.రత్నషీలామణి, ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం చేతుల మీదుగా లండన్ బుక్ ఆఫ్ రికార్డ్స్ సర్టిఫికెట్‌ను డాక్టర్ కొండలరావు అందుకున్నారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ పేద విద్యార్థులు, ప్రజల మధ్య సేవ చేస్తూ వారి జీవితాల్లో వెలుగులు నింపడమే కాకుండా నిరంతరం వారి అభ్యున్నతికి కృషి చేయడం అభినందించాల్సిన విషయం అన్నారు. కొండలరావు అందిస్తున్న సేవలకు గుర్తింపుగా లండన్ బుక్ ఆఫ్ రికార్డ్స్ దక్కడం యూనివర్సిటీకి గర్వకారణం అన్నారు. రెక్టార్ ఆచార్య కె.రత్నషీలామణి మాట్లాడుతూ కొండలరావు సేవలను స్ఫూర్తిని తీసుకోవాలని కోరారు. రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం మాట్లాడుతూ ఉద్యోగిగా విధులు నిర్వహిస్తూనే పేదలకు సేవ చేయాలనే లక్ష్యంతో నిరంతరం శ్రమిస్తున్నారని ప్రశంసించారు. కార్యక్రమంలో దూర విద్యా కేంద్రం ఇన్‌చార్జ్ డైరెక్టర్ ఆచార్య వి.వెంకటేశ్వర్లు, అడ్మిషన్ల విభాగం ఇన్‌చార్జ్ డైరెక్టర్ ఆచార్య పి. బ్రహ్మాజీరావు, వ్యాయామ విద్య డైరెక్టర్ ఆచార్య పీపీఎస్ పాల్ కుమార్, పరీక్షల నియంత్రణ అధికారి ఎ.శివప్రసాద్, వై.రాధాకృష్ణ, దినసరి ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ప్రభాకర్, ఉపాధ్యక్షుడు రత్తయ్య, కోశాధికారి రాజకుమార్ పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీల పేరుతో రాష్ట్రాన్ని దోచుకుంది జగనే

- రెవెన్యూశాఖ మంత్రి సత్యప్రసాద్



రేపల్లె, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ పాలనలో రాష్ట్ర విద్యుత్‌రంగంపై దాదాపు లక్షా 30వేల కోట్లు భారాన్ని మోపిన జగన్ ఇప్పుడు చిలకపలుకులు పలుకుతున్నాడని రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ పేర్కొన్నారు. యూనిట్ రూ.5లకు దొరికే విద్యుత్‌కు బదులు రూ.8 నుంచి రూ.14 వరకు కొనుగోలు చేసి ప్రజలపైన జగన్‌రెడ్డి మోయలేని భారాన్ని మోపారన్నారు. సోలార్‌విండ్ ఎనర్జీ పీపీఏలను రద్దు చేసి రాష్ట్రానికి 10 వేల మెగావాట్లు పునరుత్పాదక విద్యుత్‌ను జగన్ అందుబాటులో లేకుండా చేశారన్నారు. 2022 నుంచి 2024 వరకు రెండేళ్ల కాలానికి రూ.17వేల కోట్లు ట్రూఅప్ చార్జీలను పెంచాలని ఆనాడే జగన్ సర్కార్ ఆమోదించిందన్నారు. ట్రూఅప్ చార్జీలనే రెండేళ్లపాటు పెంచకుండా ప్రస్తుతం డిసెంబర్ నుంచి అమలు చేయాలంటూ ఈఆర్‌సీ ఉత్తర్వులు ఇచ్చిందన్నారు.

జగన్ అబద్ధాన్ని జనం నమ్మడం లేదు

- చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు



వినుకొండ, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం జగన్‌రెడ్డి అబద్ధాన్ని జనం నమ్మడం లేదని పోరుబాట వైఫల్యంతో మరోసారి తేలిపోయిందని ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు ఒక ప్రకటనలో శుక్రవారం తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎక్కడా పట్టుమని 10 మంది ప్రజలు కూడా వైసీపీ ఆందోళనలో లేరని అన్నారు. కనిపించిన కొద్దిమంది పార్టీ కార్యకర్తలు కూడా ఉదయం అటెండెన్స్‌లు వేయించుకొని జారుకోవడం జగన్, వైసీపీ దుస్థితిని తెలియజేస్తుందని తెలిపారు. జగన్ అద్దం ముందు నిలుచొని తనను తాను ప్రశ్నించుకోవాల్సిన విషయాలపై రోడ్లపైకి వెళ్లి ఆందోళనలు చేయడం వలన ఏం ఉపయోగమని చురకలు వేశారు.

వైసీపీ నేతలు డ్రామాలు ఆపాలి

- టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్



నరసరావుపేట టౌన్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో తొమ్మిదిసార్లు అడ్డగోలుగా విద్యుత్ చార్జీలు పెంచి, నిరసనల పేరుతో ఇప్పుడు వైసీపీ నేతలు చేస్తున్న డ్రామాలు ఇక ఆపాలని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ శుక్రవారం అన్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో అక్షరాల తొమ్మిదిసార్లు విద్యుత్ చార్జీలు పెంచిన విషయాన్ని మర్చిపోయారా అని ప్రశ్నించారు. ఈ రోజు తగ్గించాలని నిరసన పేరుతో వైసీపీ నేతలు పెద్ద డ్రామాలు ఆడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ నేతలు చేస్తున్న విద్యుత్ పోరుబాట డ్రామాలు, ఆ పార్టీ నేతలు విద్యుత్ కార్యాలయం వద్ద నిరసన ప్రదర్శన చేసి కూటమి ప్రభుత్వం, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మీద బురద చల్లటాన్ని తీవ్రంగా ఖండించారు. అవినీతి, అక్రమాల కేసుల నుంచి ప్రజల దృష్టి మరల్చేందుకు నిరసన కార్యక్రమాల పేరుతో ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. సౌర విద్యుత్ ఒప్పందాల్లో ముడుపులు కేసుల్లో అమెరికాలో అడ్డంగా దొరికిపోయిన వైసీపీ అధినేత జగన్‌రెడ్డి పోరుబాట పేరిట ప్రజల దృష్టి మరల్చే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు.

బస్సులో నుంచి దిగబోయి యువకుడు మృతి

మాచర్లటౌన్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): వేగంగా వెళ్తున్న ఆర్టీసీ బస్సులో నుంచి దిగబోయి బస్సు టైరు కింద పడి ఓ యువకుడు మృతి చెందిన సంఘటన గురువారం రాత్రి మాచర్ల పట్టణంలో జరిగింది. వెల్దుర్తి మండలం బోదలవీడుకు చెందిన పంగులూరి అజిత్ (18) గురువారం సాయంత్రం మండలంలోని కంభంపాడు గ్రామానికి వెళ్లి తిరిగి స్వగ్రామానికి వెళ్లేందుకు మాచర్లకు చేరుకున్నాడు. బస్టాండ్‌లో గొట్టిపాళ్ల వెళ్తున్న ఆర్టీసీ పల్లెవెలుగు బస్సును హడావుడిగా ఎక్కాడు. బస్సు అంబేద్కర్ సెంటర్ వద్దకు రాగానే కండెక్టర్ ఈ బస్సు బోదలవీడు వెళ్లదని చెప్పడంతో అజిత్ బస్సు దిగబోయి కిందపడ్డాడు. బస్సు వెనుకటైర్లు అజిత్ కాళ్లపై నుంచి వెళ్లడంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. అజిత్‌ను పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వైద్యులు చికిత్స నిర్వహిస్తుండగా అజిత్ మృతి చెందాడు. పట్టణ ఎస్ఐ నరసింహ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

మాచర్ల రూరల్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం శుక్రవారం నాటికి 573.80 అడుగులు ఉంది. ఇది 266.10 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 7678 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 8280 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 29988 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2400, ఎల్ఎల్‌సీ ద్వారా 300 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్ 48,646 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 31,229 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : పులిచింతల ప్రాజెక్టులో శుక్రవారం 40.18 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. పవర్ జనరేషన్ ద్వారా రెండు వేల క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల అవుతుందన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.6.00
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	111.119.130
చికెన్ విత్ స్కిన్	210.00
చికెన్ స్కిన్ లెస్	220.00

47,832 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు గురువారం 41,094 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 47,832 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి వినుకొండ ఆంజనేయులు తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 40,899 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	7500	14000
నెంబరు. 5	10000	12000
273	8000	11200
341	8500	14000
4884	11000	11000
సూపర్ 10	11000	13500
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	7500	16400
బ్యాడిగి	7500	13500
దేవనూరు డీలక్స్	8000	14500
తెల్లకాయలు	4000	10500

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
ఏసీ కామన్ వెరైటీ		
334	7500	15000
నెంబరు.5	8000	13500
273	9000	12000
341	8000	13500
4884	10500	12000
సూపర్ 10	--	--
ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	7500	16000
బ్యాడిగి	8000	14000
దేవనూరు డీలక్స్	8500	10800
తెల్లకాయలు	4000	10000

సచివాలయాల్లో ఎస్సీ కులాల జాబితా ప్రచురణ : కమిషనర్

సత్తెనపల్లి, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : సత్తెనపల్లి పట్టణ పరిధిలోని అన్ని వార్డులకు సంబంధించిన షెడ్యూల్ కులాల వారి కుల సర్వే జాబితా వివరాలను సంబంధిత సచివాలయాల్లో ప్రచురించటం జరిగిందని మునిసిపల్ కమిషనర్ షమ్మి శుక్రవారం విలేకరులకు తెలిపారు. దీనికి సంబంధించి జాబితాలో నమోదైన షెడ్యూల్ కులాల వారికి చెందిన ప్రతి ఒక్కరూ జాబితాను పరిశీలించి ఏమైనా అభ్యంతరాలు ఉన్న ఎడల సంబంధిత సచివాలయ కార్యదర్శికి 31వ తేదీ లోపు అందించాలని తెలిపారు. తెలియజేసిన అభ్యంతరాలను జనవరి 6వ తేదీ వరకు సంబంధిత డిజిటల్ అసిస్టెంట్ లాగిన్‌లో ఆన్‌లైన్‌లో నమోదు చేసి వెరిఫికేషన్ చేపడతామని ఆయన చెప్పారు. నమోదు చేసిన అభ్యంతరాలన్నీ విచారణ చేసిన అనంతరం జనవరి 10వ తేదీ నాటికి సచివాలయాల్లో ప్రచురించబడతాయన్నారు. జాబితాలో నమోదైన షెడ్యూల్ కులాల వారు వారి వివరాలను సచివాలయాల్లో ప్రచురించిన జాబితాలను పరిశీలించి తప్పొప్పులు ఉంటే తగు ఆధారాలతో సచివాలయాల్లో కార్యదర్శికి అందించాలని ఆయన తెలిపారు.

నేటి నుంచి ఉపాధి పనులపై సామాజిక తనిఖీ

సత్తెనపల్లి రూరల్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలో జరిగిన ఉపాధి పనులపై ఈనెల 28వ తేదీ నుంచి సామాజిక తనిఖీలు జరుగుతాయని ఎంపీడీవో బండి శ్రీనివాసరెడ్డి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశపు హాల్‌లో శుక్రవారం సామాజిక తనిఖీ బృందం సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మండలంలో 2023-24 ఆర్థిక సంవత్సరంలో సుమారు రూ.14 కోట్లతో జరిగిన 1400 పనులపై సామాజిక తనిఖీ జరుగుతుందన్నారు. పది బృందాలు తనిఖీల్లో పాల్గొంటాయని, జరిగిన పనులను పరిశీలిస్తారని ఎంపీడీవో తెలిపారు. సామాజిక తనిఖీ పక్కాగా చేపట్టాలని బృందం సభ్యులకు ఆయన సూచించారు. సమావేశంలో ఏపీవో జీ.వెంకట నారాయణ, ఉపాధి హామి పథకం సిబ్బంది పాల్గొన్నారు.

షెడ్యూల్ కులాల జాబితాపై అభ్యంతరాలు తెలియజేయాలి

ముప్పాళ్ళ, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని అన్ని గ్రామాలకు సంబంధించిన షెడ్యూల్ కులాల వారి కుల సర్వే జాబితా వివరాలను సంబంధిత సచివాలయాల్లో ప్రచురించామని, దీనికి సంబంధించి అభ్యంతరాలు ఏమైనా ఉంటే గ్రామ వీఆర్‌వోకు, పంచాయతీ కార్యదర్శికి తెలియ జేయాలని తహసీల్దార్ ఎం.భవానీ శంకర్ శుక్రవారం తెలిపారు. ఈనెల 31వ తేదీ లోపు అభ్యంతరాలకు సంబంధించి దరఖాస్తులను అందజేయాలన్నారు. తదుపరి జాబితా అభ్యంతరాలను సరిచేసి జనవరి 10వ తేదీ నాటికి ప్రచురిస్తామని తెలిపారు. గ్రామ సచివాలయాలను సందర్శించి అక్కడ ప్రచురించిన జాబితాను షెడ్యూల్ కులాలకు సంబందించిన వారు పరిశీలించాలన్నారు.

● గురజాలటౌన్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అన్ని గ్రామాలకు సంబంధించిన షెడ్యూల్ కులాల సర్వే జాబితాను సంబంధిత సచివాలయాల్లో అందుబాటులో ఉంచామని తహసీల్దార్ నగేష్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ సర్వే జాబితాపై ఏమైనా అభ్యంతరాలుంటే ఈనెల 31లోగా వీఆర్వోకు గానీ పంచాయతీ కార్యదర్శికిగానీ తెలపాలన్నారు. జనవరి 6వ తేదీన వెరిఫికేషన్, 10వ తేదీన తుది జాబితాను ప్రచురిస్తామని తహసీల్దార్ నగేష్ తెలిపారు.

● బెల్లంకొండ, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : కుల సర్వే జాబితాను సవరణ చేసుకోవాలని తహసీల్దార్ మున్నీసా బేగం అన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం ఆమె మాట్లాడుతూ బెల్లంకొండ మండల పరిధిలోని అన్ని గ్రామాలకు సంబంధించిన షెడ్యూల్ కులాల వారి కుల సర్వే జాబితా, వివరాలు ఆయా గ్రామాల్లో ఉన్న సచివాలయాల్లో ప్రచురించటం జరిగిందన్నారు. షెడ్యూల్ కులాలకు చెందిన ప్రతి ఒక్కరూ జాబితాను పరిశీలించి ఏమైనా అభ్యంతరాలు ఉన్న ఎడల సంబంధిత వీఆర్‌వో, పంచాయతీ కార్యదర్శులకు డిసెంబరు 31లోపు అందజేయాలని సూచించారు.

సత్రశాల ఆలయ హుండీ లెక్కింపు

రెంటచింతల, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : కృష్ణానది ఒడ్డున గల సత్రశాలలోని శ్రీగంగా భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి ఆలయం కార్తీక మాసం సందర్భంగా హుండీ ఆదాయం రూ.70,382 వచ్చినట్లు సత్తెనపల్లి ఎండోమెంట్ ఇన్స్‌పెక్టర్ లీలావతి శుక్రవారం చెప్పారు. గత కార్తీక మాసంలో రూ.73,956 వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో ఈవో గాదే రామిరెడ్డి, పూజారి శర్మ, గుండా శివయ్య, నీలం మల్లయ్య, శ్రీనివాసరెడ్డి, ప్రభురాజు తదితరులు పాల్గొన్నారు.

త్యాగాల చరిత్ర సీపీఐది

రెంటచింతల, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : పీడిత ప్రజల రైతు కార్మిక వర్గ పక్షపాతిగా అసమాన త్యాగాలతో సీపీఐ నిర్మితమైందని సీపీఐ మండల కార్యదర్శి కె.రంగనాయకులు అన్నారు. సీపీఐ శత వసంతాల ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం మంచికల్లు గ్రామంలో జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వై.నాగార్జున, చేపూరి శ్రీనివాసరావు, శంకర్‌రావు,సంజీవరావు, నందీశ్వరరావు, వలి, తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వ నమోదు

అచ్చంపేట, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : అచ్చంపేటలోని 52వ బూత్‌లో శుక్రవారం తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ముమ్మరంగా నిర్వహించినట్లు టీడీపీ నాయకుడు తిరువాయిపాటి ఆంజనేయులు తెలిపారు. 52వ బూత్‌లో జరిగిన సభ్యత్వ నమోదులో అనేక మంది టీడీపీకి చెందిన మహిళలు పాల్గొన్నారు. అంజనేయులు, యువగళం నాయకులు బోసు పాల్గొన్నారు.

పౌష్టికాహారం పంపిణీ

దాచేపల్లి, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): దాచేపల్లిలోని ప్రభుత్వ ఆసుపత్రిలో హెచ్‌ఐవీతో బాధపడుతున్న వారికి పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. శుక్రవారం దాచేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మాజీ సర్పంచ్ తంగెళ్ల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో హెచ్‌ఐవీ బాధితులు 50 మందికి పౌష్టికాహారాన్ని డాక్టర్ అమూల్య అందజేశారు. ఈ కార్యక్రమంలో మహ్మద్ గౌస్, కోమలి పాల్గొన్నారు.

కనిపించని ప్రమాద హెచ్చరిక బోర్డులు

● రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోని అధికారులు

దాచేపల్లి, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ-ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు సరిహద్దు మండలంగా ఉన్న దాచేపల్లి రవాణా పరంగా కీలకమైన రహదారిగా మారింది. ఈ రహదారిపై కోట్ల రూపాయల నిధులతో నాలుగు వరుసలు, రెండు వరుసలు రహదారులు ఏర్పాటు చేశారు. రోజుకు వందల సంఖ్యల్లో భారీ వాహనాలు, వేల సంఖ్యల్లో కార్లు, ద్విచక్ర వాహనాలు, ట్రాలీ ఆటోలు, లారీలు రాకపోకలు సాగిస్తున్నాయి. ఈ రహదారిపై ప్రమాద హెచ్చరికలు గుర్తు చేస్తూ మలుపుల వద్ద ఎటువంటి బోర్డులు కానీ, ప్రమాదాలను తెలియజేసే సూచికలు గానీ లేవు. తమిళనాడు, కర్నాటక, ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర రాష్ట్రాల నుంచి భారీ లోడుతో వాహనాలు హైదరాబాద్, చెన్నై వంటి మహానగరాలకు అతివేగంగా ప్రయాణాలు సాగిస్తుంటాయి. రాత్రి 9 గంటల నుంచి తెల్లవారుజామున 6 గంటల వరకు గంటకు 150 కిలోమీటర్ల వేగంతో బెంగుళూరు, హైదరాబాద్ మధ్య తిరిగే ప్రైవేటు, ప్రభుత్వ ఆర్‌టిసి బస్సులు రాకపోకలు సాగిస్తుంటాయి. గత కొద్దిరోజుల క్రితం హైదరాబాద్ నుండి ఒంగోలుకు ప్రయాణిస్తున్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సు కిందపడి జీవాలు మృతి చెందగా 50 లక్షల రూపాయల ఆస్తి నష్టం జరిగింది. రోజు దాచేపల్లిలో ఏదో ఒకచోట ద్విచక్ర వాహనాలు ఢీకొనడం, ద్విచక్రవాహనాలు, లారీలు, బస్సులు ఢీకొనడం సర్వసాధారణంగా మారింది. వాహనాలు ఒకదానికొకటి ఎదురుగా వచ్చి ఢీకొనడంతో ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. ఎంతో మంది యువకులు తీవ్రగాయాల పాలవుతున్నారు. ఇంత జరుగుతున్నా నేషనల్ హైవే అథారిటీ వారు భద్రతా చర్యలు, హెచ్చరిక బోర్డులు చేపట్టకుండా నిర్లక్ష్యంగా వదిలేయడంపై స్థానికుల నుండి తీవ్ర విమర్శలు వస్తున్నాయి. వెలకట్టలేని ప్రాణాలను కాపాడుకోవాలంటే హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా వుంది.



నడికూడి-అంబాపురం మధ్య ప్రమాద సూచికలు లేని రెండు వరుసల రహదారి

అర్జీల పరిష్కారానికి కృషి చేస్తున్నాం : తహసీల్దార్



రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న తహసీల్దార్ భవానీ శంకర్

ముప్పాళ్ళ డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : మండ లంలోని ఇరుకుపాలెంలో శుక్రవారం రెవెన్యూ గ్రామ సదస్సు జరిగింది. సదస్సులో అర్జీలు ఇచ్చిన ప్రతి వారికి రసీదును ఇచ్చినట్లు తహసీల్దార్ ఎం.భవానీ శంకర్ తెలిపారు. రెవెన్యూ సదస్సులో ఇచ్చిన అర్జీల పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. ఇప్పటి వరకు గ్రామంలో 39 దరఖాస్తులు వచ్చాయన్నారు. రెవెన్యూ సదస్సులో డిప్యూటీ తహసీల్దార్ లక్ష్మీ ప్రసాదు, టీడీపీ మండల అధ్యక్షుడు బత్తుల నాగేశ్వరరావు, మాజీ సర్పంచ్ దరువూరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

● మాచవరం, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో భూ సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను ప్రవేశపెట్టిందని తహసీల్దార్ క్షమారాణి సూచించారు. మండలంలోని చెన్నాయపాలెం గ్రామంలో శుక్రవారం ఏర్పాటు చేసిన రెవెన్యూ సదస్సుకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సదస్సులో మొత్తం ఆరు అర్జీలు రాగా వెబ్ ల్యాండ్ నమోదు, పాసు పుస్తకాల కొరకు అర్జీలు వచ్చినట్లు తెలిపారు. ఈ సదస్సుల్లో మండల సర్వేయర్ సాల్మన్ రాజు, మాజీ సర్పంచ్ బొగ్గవరపు అంజయ్య, మండ్ల రామ కోటయ్య, బీట్ అధికారి బిల్లల వెంకటేశ్వర్లు, ఆర్ఐ కోటేశ్వరరావు, వీఆర్‌వో అఖిల్, రైతులు పాల్గొన్నారు.

● క్రోసూరు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పీసపాడు, పారుపల్లి గ్రామాల్లో శుక్రవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. భూములకు సంబంధించిన అర్జీలను ప్రజల నుంచి స్వీకరించారు. డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసరావు మాట్లాడుతూ రెవెన్యూ, భూ వివాదాలకు సంబంధించిన సమస్యల తక్షణ పరిష్కారం కోసమే సదస్సులు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. సదస్సుల్లో వీఆర్‌వో రామచంద్రరరావు, రెవెన్యూ అధికారులు శ్రీధర్, రాజ్యలక్ష్మి, గ్రామ సర్పంచ్ పారుపల్లి కోటమ్మ పాల్గొన్నారు.

● దాచేపల్లి, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముత్యాలంపాడు గ్రామంలో శుక్రవారం రెవెన్యూ సదస్సును నిర్వహించారు. గ్రామ సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన సదస్సులో 12 అర్జీలు వచ్చాయి. గత ప్రభుత్వ హయాంలో జరిగిన సమగ్ర భూసర్వేలో భూములపై చేసిన సర్వేపై అనుమానం వ్యక్తం చేస్తూ అర్జీలు పెట్టుకున్నారు. వచ్చిన అర్జీలను పరిశీలించి వీలైనంత త్వరలో పరిష్కరిస్తామని తహసీల్దార్ వివరించారు. ఈ సదస్సులో దేవదాయశాఖ ఈవో నెమిలిరెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ రాజు, సర్వేయర్ శ్రీనివాసరావు తదితరులున్నారు.

● అచ్చంపేట, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అంబడిపూడిలో శుక్రవారం రెవెన్యూ సదస్సులు జరిగినట్టు మండల తహసీల్దార్ కే.శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా వచ్చిన అర్జీలను పరిష్కరిస్తామన్నారు. ఈ సదస్సులో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు నందిగం ఆశీర్వాదం, సర్పంచ్ కొమ్మవరపు స్వరాజ్యలక్ష్మి, పారుపల్లి నరసింహారావు, కొమ్మవరపు దిబ్బయ్య, చిలకా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

● నకరికల్లు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : భూములకు సంబంధించిన సమస్యలను పరిష్కరించేందుకే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్టు తహసీల్దార్ కే.పుల్లారావు తెలిపారు. నకరికల్లు మండలం గుండ్లపల్లిలో శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో రెవెన్యూకు సంబంధించి 14 అర్జీలు, సర్వే సమస్యలకు సంబంధించి ఐదు అర్జీలు వచ్చినట్టు తహసీల్దార్ తెలిపారు. ఈ సమావేశంలో మండల సర్వేయర్ వెంకటేశ్వర్లు, డిప్యూటీ తహసీల్దార్ కే శ్రీనివాసరావు, ఆర్ఐ పురుషోత్తం, షేక్ అహమ్మద్, కరాలపాటి వలి తదితరులు పాల్గొన్నారు.

సాదాసీదాగా ముగిసిన మున్సిపల్ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ కొత్త వెంకట సుబ్బారావు

పిడుగురాళ్ల, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ బడ్జెట్ సమావేశం శుక్రవారం చైర్‌పర్సన్ కొత్త వెంకట సుబ్బారావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఎజెండాలోని అంశాలను అధికారులు చదువుతుండగా వైసీపీ కౌన్సిలర్లు జోక్యం చేసుకొని ఎజెండాలో అంశాలకు నిధులు ఎక్కడి నుంచి వస్తున్నాయో, వేటికి ఖర్చు చేస్తున్నారో సమాచారం ఇవ్వాలని తెలిపారు. అంతేకాకుండా బైపాస్ రోడ్డుకు ఇరువైపుల ప్రభుత్వ స్థలాలను ఆక్రమించుకుంటూ ప్రహరీగోడలు నిర్మిస్తున్నా టౌన్ ప్లానింగ్ అధికారులు చోద్యం చూస్తున్నారని కౌన్సిలర్ వాసుదేవరెడ్డి, కొక్కెర శ్రీను, అప్పిరెడ్డి, మాదాల కిరణ్‌లు తెలిపారు. కమిషనర్ శ్రీధర్ సమాధానమిస్తూ ఇప్పటికే అనధికార కట్టడాలు గుర్తించడం జరిగిందని, నోటీసులు కూడా ఇచ్చామన్నారు. ప్రభుత్వ నిధులు ఏ విధంగా ఖర్చు చేయాలో మార్గదర్శకాల ప్రకారమే ఖర్చుచేయడం జరుగుతుందని సమాధానమిచ్చారు. ఈ సమావేశంలో పలువురు కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వం విద్యుత్ చార్జీలు తగ్గించాలి

● వైసీపీ పోరుబాటలో జిల్లా ఇన్‌చార్జి రామకృష్ణారెడ్డి



డీఈ సింగయ్యకు వినతిపత్రం అందిస్తున్న రామకృష్ణారెడ్డి

మాచర్లటౌన్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించాలని వైసీపీ జిల్లా ఇన్‌చార్జి, మాచర్ల మాజీ శాసనసభ్యుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ శుక్రవారం పట్టణంలో వైసీపీ ఆధ్వర్యాన పోరుబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఆరు నెలలు గడిచినా ప్రజలపై విద్యుత్ చార్జీల రూపంలో రూ.15485 కోట్ల పెనుభారం మోపేందుకు ప్రయత్నిస్తుందన్నారు. తప్పుడు కేసులు పెట్టిన ఎవరినీ వదిలిపెట్టను. ఎన్ని రోజులు బెదిరిస్తారు.. మీ ఉడత ఊపులకు భయపడను అన్నారు. అనంతరం విద్యుత్ శాఖ కార్యాలయంలో డీఈ సింగయ్యకు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో బొమ్మిరెడ్డి సుబ్బారెడ్డి, బూడిద శ్రీనివాసరావు యాదవ్, తాడి వెంకటేశ్వరరెడ్డి, నవులూరి భాస్కర్‌రెడ్డి, కౌన్సిలర్లు సంతోషం, మున్నా మురళీ, రామాంజిరెడ్డి సుందరరావు, అన్నెం అనంతరావమ్మ, అబ్దుల్ జలీల్, గొట్టం బ్రహ్మారెడ్డి పాల్గొన్నారు.

● సత్తెనపల్లి, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : పెంచిన విద్యుత్ చార్జీలను తక్షణమే విమరించు కోవాలని వైసీపీ నాయకులు శుక్రవారం పట్టణంలో ప్రదర్శన, విద్యుత్ శాఖ కార్యాలయం వద్ద నిరసన తెలియ జేశారు. కార్యక్రమంలో పార్టీ నేతలు చిట్టా విజయ భాస్కర్‌రెడ్డి, అచ్యుత శివ ప్రసాదు, వెంకటేశ్వరరెడ్డి, వల్లెం నరసింహారావు, కోటేశ్వర నాయక్, సుబ్బారెడ్డి, భాస్కర్‌రెడ్డి, పురుషోత్తం తదితర వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

● పెదకూరపాడు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ చార్జీలు పెంచమని కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు హామి ఇచ్చి ఎన్నికలయ్యాక పేద ప్రజల నడ్డి విరుస్తూ విద్యుత్ చార్జీలు పెంచిందని ఎంపీపీ బెల్లంకొండ మీరయ్య అన్నారు. పెదకూరపాడులో వైసీపీ శ్రేణులు శుక్రవారం నిరసన తెలియజేసి విద్యుత్ శాఖ ఏఈ దాసరి రామకృష్ణకు వినతిపత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు బత్తుల కోటేశ్వరరావు, నియోజకవర్గంలోని పలు మండల, గ్రామాలకు చెందిన వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నైపుణ్యాభివృద్ధి శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలి

గురజాలటౌన్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ, మెప్మా గురజాల నగర పంచాయతీ పరిధిలో నైపుణ్యాభివృద్ధి శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలని నగర పంచాయతీ కమిషనర్ శివన్నారాయణ కోరారు. ప్లంబరు, కార్పెంటరు, ఎలక్ట్రీషియన్, ఏసీ, గీజర్, టివి, రిఫ్రిజిరేటర్, వాషింగ్‌మెషిన్, బ్యూటీషియన్, పెయింటర్ తదితర సేవలకు ఈనెల 31వ తేదీలోగా సచివాలయం 1, 2లలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు ఫారంకు ఆధార్, రేషన్, బ్యాంకు పాసుబుక్, పాన్ కార్డు నకళ్లను జత చేయాలని కమిషనర్ శివన్నారాయణ తెలిపారు.

● పిడుగురాళ్ల, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ మెప్మా సంఘం పరిధిలో వివిధ రకాల సేవలు అందించేందుకు కార్పెంటర్, ఎలక్ట్రీషియన్, ప్లంబర్, ఏసి, గీజర్, టీవీ, రిఫ్రిజిరేటర్, వాషింగ్ మిషన్ రిపేరు, బ్యుటీషియన్ (స్త్రీలు, పురుషులు) తదితర సేవలు అందించేందుకు నైపుణ్యాభివృద్ధి సంస్థ ఎన్ఎస్‌డిసి ద్వారా శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్‌తో పాటు అర్హత కలిగిన వారికి హోమ్ ట్రైయాంగిల్ ప్లాట్‌పారం ద్వారా జీవనోపాధి కల్పించబడుతుందని కమిషనర్ శ్రీధర్ తెలిపారు. వివరాలకు మెప్మా కార్యాలయం, పిడుగురాళ్ల, 8309836728ను సంప్రదించాలన్నారు.

బాల్య వివాహాల రహిత ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దుదాం : హెచ్‌ఎం

మాచర్ల రూరల్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాన్ని బాల్య వివాహాల రహిత ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దుదామని హెచ్‌ఎం ఐవి నాగమణి అన్నారు. మండలంలోని కొప్పునూరు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో విద్యార్థినులకు బాల్య వివాహాల వలన కలిగే దుష్పరిణామాలను శుక్రవారం వివరించారు. అనంతరం ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ బీవీఎస్ సుబ్బాచారి, పద్మావతి, చంద్రకళ, గోవిందమ్మ, జ్యోతిశ్రీ, రంగమ్మ, మరియమ్మ, పౌలురాజు, శ్రీనివాసరావు, నారాయణ, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా లక్ష్మణదత్తు జయంతి

మాచర్లటౌన్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): కేసీపీ సంస్థల ఎగ్జిక్యూటివ్ చైర్మన్ డాక్టర్ వెలగపూడి లక్ష్మణదత్తు 87వ జయంతిని శుక్రవారం పట్టణంలోని కేసీపీ సిమెంట్ ఫ్యాక్టరీలో ఉద్యోగులు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని పీఎస్సార్ ఆంజనేయులు కంటి ఆసుపత్రి ఆధ్వర్యాన నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. లక్ష్మణదత్తు చిత్రపటానికి సీనియర్ జనరల్ మేనేజర్ వెంకటరమణ ఆధ్వర్యాన పూలమాలలు వేసి నివాళులర్పించి ఆయన చేసిన సేవలను కొనియాడారు. అనంతరం ఉద్యోగులకు పోటీలు జరిపి బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో డీజీఎంలు కె.రామకోటేశ్వరరావు, ఆనందరెడ్డి, బి.శ్రీనివాసరావు, ప్రసాద్, ఏజీఎంలు నాగేశ్వరరావు, శేషంరాజు, అమరలింగాచారి, చంద్రశేఖర్, ఆదిశేషు, శ్రీనివాసరావు, రమేష్, ఆనందరావు, ఏడుకొండలు, శివయ్య, నారాయణ, శ్రీనివాసరెడ్డి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

దేశ ఆర్థిక అభివృద్ధిలో మన్మోహన్‌సింగ్‌ది చెరగని ముద్ర

మాచర్లటౌన్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): దేశ ఆర్థిక అభివృద్ధిలో మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ చెరగని ముద్ర వేశారని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ మన్మోహన్‌సింగ్ మరణం దేశానికి తీరనిలోటు అన్నారు. మన్మోహన్‌సింగ్ కుటుంబసభ్యులకు తన ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.

కాంగ్రెస్ నేతల నివాళులు

సత్తెనపల్లి, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : పట్టణ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ సంతాప సభను నిర్వహించారు. ఆయన చిత్రపటానికి కాంగ్రెస్ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు మాట్లాడుతూ దేశ ప్రధానిగా మన్మోహన్‌సింగ్ అందించిన సేవలు మరువలేనివన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త చుక్క చంద్రపాల్, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దాసరి జ్ఞానరాజ్‌పాల్, కొత్త లక్ష్మయ్య, కే.ఆనంద్, పురుషోత్తం, మోహన్‌రావు, శేఖర్, శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం నాయకుల సంతాపం

అమరావతి, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి) : మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతికి సీపీఎం నాయకులు బి.సూరిబాబు, కాంగ్రెస్ నాయకులు బత్తుల గోపి, టీడీపీ నాయకుడు కె.వసంతరావు సంతాపం తెలిపారు. దేశ ఆర్థిక అభివృద్ధిలో, పేదలకు ఉపాధి కల్పనలో మన్మోహన్‌సింగ్ చేసిన కృషి ఆదర్శణీయం అన్నారు.

గ్రామాభివృద్ధికి కృషి : సర్పంచ్

కారంపూడి, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): కారంపూడి గ్రామాభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నట్లు సర్పంచ్ సరస్వతిబాయి బాలునాయక్ అన్నారు. స్థానిక ఎస్టీ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేయనున్న సీసీ రోడ్ల నిర్మాణానికి శుక్రవారం ఆమె కూటమి నేతలతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ శాసనసభ్యుడు జూలకంటి బ్రహ్మానందరెడ్డి సహకారంతో గ్రామంలో సమస్యల పరిష్కారానికి కృషి చేయనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో పంగులూరి అంజయ్య, చప్పిడి రాము, కటికల బాలకృష్ణ, తండా మస్తాన్‌జానీ, ఎస్‌పీఆర్ కృష్ణ, నాగులునాయ్, గోరంట్ల నాగేశ్వరరావు, భవిరిశెట్టి పూర్ణచంద్రరావు, నాగవరపు రాముడు, బాణావత్ కోటయ్యనాయక్, బుడ్డానాయక్, మంత్రునాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌కేబీఆర్ జూనియర్ కళాశాలకు భోజనం ప్లేట్లు అందజేత

మాచర్లటౌన్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎస్‌కేబీఆర్ జూనియర్ కళాశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజనానికి అవసరమైన ప్లేట్లను కేసీపీ ఉద్యోగులు శుక్రవారం కళాశాల ప్రిన్సిపాల్ బాలయ్యకు అందించారు. విద్యార్థులకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని కేసీపీ ఉద్యోగులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కేసీపీ సీనియర్ జనరల్ మేనేజర్ వెంకటరమణ, హెచ్‌ఆర్‌ఎస్‌ఎస్ జి శ్రీనివాసరావు, వెల్ఫేర్ ఆఫీసర్ సీహెచ్ శ్రీనివాసరావు, సంద్ర ప్రసాద్, గోసుల ప్రసాద్ పాల్గొన్నారు.

నీటితీరువా బకాయి త్వరగా చెల్లించాలి

రాజుపాలెం, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రైతులందరూ నీటి తీరువా బకాయిని త్వరగా చెల్లించాలని తహసీల్దార్ దుర్గేశ్వరరావు కోరారు. మండలం మొత్తం మీద రూ1,36,67,212 నగదు చెల్లించాల్సి ఉండగా ఇప్పటి వరకు రూ16,98,075 నగదు మాత్రమే చెల్లించారని చెప్పారు. మిగిలిన రైతులు త్వరితగతిన చెల్లించాలని పిలుపునిచ్చారు. అనంతరం మండల పరిధిలో అక్రమంగా వేసిన లే అవుట్‌లను పరిశీలించి అనుమతి తీసుకోవాలని చెప్పారు.

31న నకరికల్లులో ఉచిత కంటి వైద్య శిబిరం

నకరికల్లు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : నకరికల్లులోని చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్‌లో మంగళవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు బ్యాంక్ మేనేజర్ శాయి చంద్ తెలిపారు. చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్ ఆధ్వర్యంలో డాక్టర్ రామలింగారెడ్డి, మ్యాక్సీ విజన్ కంటి హాస్పటల్ సహకారంతో ఈ వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. ఆరోగ్యశ్రీ కార్డు, హెల్త్ కార్డు ఉన్న వారికి అన్ని రకాల కంటి ఆపరేషన్‌లు ఉచితంగా చేస్తారని తెలిపారు. శుక్లం ఆపరేషన్‌లు చేయించుకొనే వారికి ఉచిత రవాణా సదుపాయం ఏర్పాటు చేసినట్టు చెప్పారు.

ద్విచక్ర వాహనాలు ఢీకొని ఇద్దరికి తీవ్రగాయాలు

దాచేపల్లి, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): అతివేగంగా ప్రయాణిస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొని తీవ్రగాయాల పాలైన సంఘటన శుక్రవారం దాచేపల్లి నగర పంచాయతీలోని నడికూడి టర్నింగ్ వద్ద వున్న పెట్రోలు బంకు సమీపంలో చోటు చేసుకుంది. దాచేపల్లి నుండి నడికూడి వైపు ద్విచక్ర వాహనంపై వెళ్తున్న యువకుడు, నడికూడి నుండి దాచేపల్లి వైపు ద్విచక్ర వాహనంపై వస్తున్న మరో యువకుడు ఎదురెదురు ఢీకొన్నారు. ఈ సంఘటనలో ఓ యువకుడికి మొఖంపై గాయాలుకాగా, మరో యువకుడికి కాళ్లు చేతులకు దెబ్బలు తగిలాయి. ఈ సంఘటనపై దాచేపల్లి ఎస్ఐ పాపారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. గాయపడిన ఇరువురు యువకులను ఆసుపత్రికి తరలించారు.

విద్యుత్ చార్జీల పెంపు పాపం జగన్‌దే

● శాసనసభ్యుడు బ్రహ్మానందరెడ్డి



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

మాచర్లటౌన్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ చార్జీల పెంపు పాపం మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌దేనని శాసనసభ్యుడు జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో వినియోగదారులపై విద్యుత్ చార్జీల భారం రూ.32,166 కోట్లు, విద్యుత్ సంస్థలపై పెరిగిన అప్పు భారం రూ.49,560 కోట్లు వెరసి మొత్తంగా రూ.81,768 కోట్ల భారాన్ని మోపారన్నారు. రివర్స్ టెండరింగ్ పేరుతో రాష్ట్ర భవిష్యత్‌ను కాలరాసిన జగన్‌ను శాలువ కప్పి సన్మానం చేయాలా అంటూ ఎద్దేవా చేశారు. వీటీపీఎస్, కృష్ణపట్నం, థర్మల్ ప్లాంట్ ఏర్పాటులో జాప్యం వలన రూ. 12,818 కోట్లు నష్టం వాటిల్లిందని, పోలవరం హైడ్రో ఎలక్ట్రికల్ జాప్యంతో రూ.4,737 కోట్లు, స్వల్పకాలిక విద్యుత్ కొనుగోళ్ల వలన రాష్ట్ర ప్రజలపై రూ.2,691 కోట్లు, యేడాదికి 7 వేల మెగావాట్ల సోలార్ పవర్ వలన రూ.3850 కోట్లు నష్టం వాటిల్లిందని అన్నారు. అలాగే జగన్ నిర్వాకం వలన సెకీ నష్టం అప్పులపై వడ్డీ భారం రూ. 10,982 కోట్లు, ఏపీ డిస్కం, ఏపీపీడీసీఎల్ నిర్వహణపై వైఫల్యంతో రూ.9,618 కోట్లు, జెన్‌కో ప్లాంట్లలో విద్యుత్ ఉత్పత్తి తగ్గించడంతో రూ.3,135 కోట్లు నష్టం వచ్చిందన్నారు. జగన్ అసమర్థత వలన సెకీకి రూ.47,741 కోట్లు నష్టం రాగా విద్యుత్ సంస్థపై మొత్తంగా రూ.1,29,503 కోట్లు భారం వినియోగదారులపై మోపారన్నారు. రాష్ట్ర ప్రజలు ప్రతిపక్ష హోదా కూడా దక్కనివ్వకుండా 11 సీట్లకే పరిమితం చేసినా వైసీపీలో మార్పు కనిపించలేదన్నారు. రాష్ట్ర రాజధాని అమరావతిపై ఇప్పటికీ కక్ష కట్టారని, అందులో భాగంగానే ఆకాశరామన్న పేర్లతో ప్రపంచ బ్యాంకుకు ఫిర్యాదు చేస్తున్న విషయాన్ని ప్రజలు గుర్తుంచుకోవాలన్నారు. ప్రజా వ్యతిరేఖ విధానాలు అవలంబిస్తే భవిష్యత్‌లో సింగిల్ డిజిట్ కూడా రాదని ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి హెచ్చరించారు.

దుర్గమ్మ సేవలో ఎమ్మెల్యే జూలకంటి దంపతులు



దుర్గమ్మ సన్నిధిలో ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి, శోభారాణి దంపతులు

మాచర్ల రూరల్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): విజయవాడలో ఉన్న శ్రీకనకదుర్గమ్మ అమ్మవారిని శుక్రవారం మాచర్ల శాసనసభ్యుడు జూలకంటి బ్రహ్మానందరెడ్డి, శోభారాణి దంపతులు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే జూలకంటి దంపతులను ఆలయ మర్యాదలతో సన్మానించి జ్ఞాపికను అందజేశారు. ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి వెంట పంగులూరి పుల్లయ్య తదితరులు ఉన్నారు.

విద్యుత్ చార్జీలు పెంచింది వైసీపీ ప్రభుత్వమే

● తెలుగుయువత రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ శివారెడ్డి

వెల్దుర్తి, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): గడిచిన ఐదేళ్లలో ఆరు నెలలకోసారి విద్యుత్ చార్జీలను పెంచింది వైసీపీ ప్రభుత్వమేనని తెలుగు యువత రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ కుర్రి శివారెడ్డి అన్నారు. మండలంలోని శిరిగిరిపాడులో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గతంలో టీడీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని మిగులు విద్యుత్ రాష్ట్రంగా మారిస్తే జగన్‌రెడ్డి వచ్చాక విద్యుత్ వ్యవస్థలను సర్వనాశనం చేశారన్నారు. ప్రజలపై అధికభారం మోపి రాష్ట్రాన్ని అట్టడుగు స్థాయికి తీసుకెళ్లారన్నారు. ఐదేళ్లలో అవినీతి సంపాదనకు అలవాటు పడిన జగన్‌రెడ్డి ఐదు నెలలు కూడా అధికారం లేకుండా ఉండలేకపోతున్నారన్నారు. అధికారం కోల్పోయిన అక్కసుతో వైసీపీ కేడర్‌తో నిరసన కార్యక్రమాలు చేయిస్తున్నారని అన్నారు.

వైసీపీ మోసాలను ప్రజలు గమనిస్తున్నారు

● టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి సురేష్‌యాదవ్

కారంపూడి, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): వైసీపీ మోసాలను ప్రజలు గమనిస్తున్నారని టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి గోళ్ల సురేష్‌యాదవ్ అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఆరు నెలలుగా ఎవరికీ కనపడకుండా అదృశ్యంగా తిరుగుతూ ఇప్పుడు వచ్చి మాచర్లలో విద్యుత్ చార్జీలపై నిరసన ప్రదర్శనలు చేయడం ఎంతవరకు సబబు అన్నారు. గత ప్రభుత్వంలో విద్యుత్ చార్జీలే గాక నిత్యావసర వస్తువులపై ధరలు పెంచి ప్రజలను మోసం చేసి ఇప్పుడు మొసలి కన్నీరు కారుస్తున్నారన్నారు. సమావేశంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు కటికల బాలకృష్ణ, మాజీ అధ్యక్షుడు తండా మస్తాన్‌జానీ, బీసీ సెల్ కన్వీనర్ గోరంట్ల నాగేశ్వరరావు, లింగాల శ్రీనివాసరావు, విద్యా కమిటీ చైర్మన్ బాలునాయక్, ఆర్యవైశ్య సంఘ నేతలు ఎస్‌పీఆర్ కృష్ణ, కర్నాటి మహేష్, కాసుల శంకర్, పూర్ణ, తోట నరసింహారావు, కొండ, పలిశెట్టి రాఘవ పాల్గొన్నారు.

విద్యుత్‌పై ధర్నా చేసే అర్హత వైసీపీకి ఉందా : చిన్నబోయిన

రాజుపాలెం, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ అధికారంలో ఉన్న సమయంలో సుమారు పదిసార్లు విద్యుత్ చార్జీలు పెంచి రూ.1,30,000 కోట్లు అప్పు చేసి ప్రజల నెత్తిన భారం మోపిన ఆ పార్టీకి విద్యుత్ చార్జీల పెంపు అనే అంశంపై పోరుబాట పేరుతో ధర్నా చేయటం సిగ్గుచేటు అని నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు చిన్నబోయిన రాఘవరావుయాదవ్ మండిపడ్డారు. మండలంలోని అనుపాలెంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యుత్ రంగాన్ని గత ఐదేళ్ల సర్వనాశనం చేసి ఈ రోజున కొత్త నాటకానికి తెరతీయటంపై ప్రజలు అగ్రహం వ్యక్తం చేస్తున్నారన్నారు.

పౌరసరఫరాల గోదాములో తనిఖీలు



రాజుపాలెంలోని గోదాములో తనిఖీలు నిర్వహిస్తున్న ఆర్డీవో రామాకాంత్‌రెడ్డి

రాజుపాలెం, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన రాజుపాలెం గ్రామంలో ఉన్న పౌరసరఫరాల గోదాములో శుక్రవారం సత్తెనపల్లి ఆర్డీవో రామాకాంత్‌రెడ్డి తనిఖీలు చేశారు. ఆయన రికార్డులను పరిశీలించారు. గోదాములోని సీసీ కెమెరాలు సక్రమంగా పని చేస్తున్నాయో లేదో చూసి కాటా రాళ్ల సరియైనవో కాదో చూశారు. అన్ని సక్రమంగా ఉన్న విషయాన్ని గుర్తించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట తహసీల్దార్ దుర్గేశ్వరరావు, డిప్యూటీ తహసీల్దార్ షేక్ జానీబాషా ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే విలువలతో కూడిన విద్య

● ప్రముఖ ఆడిటర్ గడ్డిపాటి సుధాకర్

పెదకూరపాడు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : చదువుకు మించిన ఆయుధం లేదని, విలువలతో కూడిన విద్య ప్రభుత్వ పాఠశాలల్లోనే ఉంటుందని ప్రముఖ ఆడిటర్ గడ్డిపాటి సుధాకర్ అన్నారు. పెదకూరపాడులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు రాయపూడి సెల్ఫ్ ఫౌండేషన్ నిర్వాహకులు, ఎన్ఆర్ఐలు రామకృష్ణ(లండన్), వెంకటేశ్వరరావు(అమెరికా)ల సహకారంతో జన చైతన్య సమితి ఆధ్వర్యంలో 10వ తరగతి స్టడీ మెటీరియల్‌తో పాటు మోడల్ పేపర్ల పంపిణీని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి లక్ష్యంతో చదివినప్పుడే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు కాకాణి వెంకట రమణ, రాయపూడి సెల్ఫ్ ఫౌండేషన్ ప్రతినిధి రాయపూడి సాంబశివరావు, మాజీ సర్పంచ్ వెలగ ఈశ్వరరావు, ప్రజా కవి దర్శి శేషారావు, జన చైతన్య సమితి కో-ఆర్డినేటర్ వెలితోటి అనీల్ కుమార్, బెల్లంకొండ రాంబాబు తదితరులు ప్రసంగించారు. ఉపాధ్యాయులు ఎం.రాధాకృష్ణ, నరేష్ తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

ముప్పాళ్ళ డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని దమ్మాలపాడు హైస్కూల్‌లో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు యూటీఎఫ్ ముప్పాళ్ళ శాఖ ఆధ్వర్యంలో స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. జడ్పీటీసీ శిరిగిరి చంద్రకళ శుక్రవారం విద్యార్థులకు అందజేశారు. మొత్తం 33 మంది 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను అందజేసినట్టు హెచ్‌ఎం గార్లపాటి మిరయమ్మ తెలిపారు. కార్యక్రమంలో యూటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి షేక్ షరీఫ్ పాషా, యూటీఎఫ్ నాయకులు సీహెచ్ నాగేశ్వరరావు, ముప్వా సురేష్, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గొంతుతో మాయ..

వారు గొంతుతో మాయ చేస్తారు.. తమ స్వరాలతో పలు రకాల ధ్వనులను అనుకరిస్తూ ఆశ్చర్యపరుస్తారు.. ప్రకృతి సవ్వడులు..పక్షులు, జంతువుల అరుపులు, రాజకీయ, సినీ ఇతర ప్రముఖులను అనుకరిస్తూ అందరిచేత ప్రశంసలు పొందుతున్నారు. ఒక విధంగా తమ కళతో ప్రజలను రంజింప చేస్తారు. వారే మిమిక్రి కళాకారులు...

- ఒకే గొంతులో లక్షలాది శబ్దాలు
- ధ్వనులను సృష్టిస్తున్న కళాకారులు
- మిమిక్రీతో ప్రజలకు వినోదం
- నేడు ప్రపంచ మిమిక్రీ దినోత్సవం



గుంటూరు (తూర్పు), డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): ధ్వనిని అనుకరించడం ఒక కళ. ఇతరుల గొంతును అనుకరించి మాట్లాడటం ఒక తమాషా.. ఒక వినోదం.. దాన్నే సింపుల్‌గా మిమిక్రీ అంటాం. దీనిలో చాలా తేడాలున్నాయి. ఒకరి గొంతును మాత్రమే అనుకరించడం గాక, చుట్టుపక్కల ఉండే ధ్వనులను అనుకరించడం.. ఉదాహరణకు గుర్రం పరుగెడుతున్నపుడు డెక్కల శబ్దం, రైలు బండి వెళుతున్న శబ్దం, మనుషులనే గాక జంతువులు, పక్షులు చేసే శబ్దాలు, వాటి కూతలు, అరుపులు, ఇలా వివిధ శబ్దాలను, గొంతుకలను....తన గొంతులో పలికించడమే, వినిపించడమే మిమిక్రీ కళ.....అంతేగాక ఒక బొమ్మను తీసుకుని ఆ బొమ్మ మాట్లాడుతున్నట్లుగా, ఇతరులు గుర్తించలేని విధంగా...మనం మాట్లాడుతూ చేసే ప్రక్రియను వెంట్రిలాక్విజమ్ అంటారు. ఇది కూడా మిమిక్రీలో భాగమే...

నేడు ప్రపంచ మిమిక్రీ దినోత్సవం

శనివారం ప్రపంచమంతా మిమిక్రీ దినోత్సవం జరుపుకుంటోంది. ప్రముఖ మిమిక్రీ కళాకారుడు నేరళ్ల వేణుమాధవ్ జయంతిని పురస్కరించుకుని డిసెంబరు 28న మిమిక్రీ దినోత్సవం జరుపుకుంటున్నారు.

మిమిక్రీలో రకాలు

మిమిక్రీలో అనేక రకాలు ఉన్నాయి. వాటిలో ముఖ్యంగా ఎల్లోనెస్, జోక్స్, సాధారణ హాస్యం, మెకానికల్, శబ్దాల అనుకరణ, జంతువులు, వాహనాల శబ్దాల అనుకరణ, వెంట్రాలాక్విజమ్‌లు ప్రధానమైనవి.

తెలంగాణలో ప్రత్యేక కోర్సు

మిమిక్రీలో శిక్షణ ఇవ్వడానికి తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక కోర్సును ఏర్పాటు చేసింది. 45రోజుల పాటు ఈ శిక్షణ ఇస్తారు. ధ్వని అనుకరణతో పాటు ఇతర అంశాల్లో శిక్షణ ఇస్తారు. అంతేగాక మిమిక్రీ కళాకారులతో ప్రముఖుల గొంతులతో ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరువ చేస్తున్నారు. మన రాష్ట్రంలో ఈ కోర్సు అందుబాటులో లేదు. మిమిక్రీ కళను అభ్యసిస్తే భవిష్యత్తులో యువతకు మంచి ఉపాధి అవకాశాలు ఉన్నాయని సీనియర్ కళాకారులు చెబుతున్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ఏపీలో కూడా ఈ కోర్సును అందుబాటులోకి తీసుకురావాలని వారు కోరుతున్నారు.

నిర్వీర్యమైన భాషా సాంస్కృతిక వేదిక

మిమిక్రీ కళాకారులను ప్రోత్సహించాలనే లక్ష్యంతో 2014లో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు భాషా సాంస్కృతిక వేదికను తీసుకువచ్చారు. దీని ద్వారా మిమిక్రీ ప్రదర్శనలు నిర్వహించారు. దీంతో కళాకారులకు ఆర్థిక తోడ్పాటు, గుర్తింపు లభించింది. దీనికి తోడు గుర్తింపు పొందిన కళాకారులకు నెలకు రూ 5వేల వరకు గౌరవ వేతనం అందజేసేవారు. కానీ 2019లో వైసీపీ అధికారంలో రాగానే దీన్ని నిర్వీర్యం చేశారు. ప్రదర్శనలు, ఇతర కార్యకలాపాలను పూర్తిగా నిలిపివేశారు. దీంతో కళాకారులు ఉపాధి కోల్పోయారు. తిరిగి కూటమి ప్రభుత్వం అధికారంలో రావడంతో దీనిని పునరుద్ధరిస్తారని కళాకారులు ఎదురుచూస్తున్నారు.

పరిపూర్ణత లేకపోతే అపహాస్యం

హాస్యం ఆరోగ్యకరంగా లేకపోతే అపహాస్యం పాలవుతుంది. కొంత మంది ఈ మధ్యన మిమిక్రీ కళాకారులు నాలుగు జోక్‌లు, నాలుగు ధ్వని అనుకరణలు చేసి మమ అనిపిస్తున్నారు. దీంతో ఈ కళ ఆదరణ కోల్పోతోందని సీనియర్ కళాకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 45 నిమిషాల పాటు దీనిని ఏకదాటిన ప్రదర్శన నిర్వహించి, ప్రేక్షకులను అలరించాలని అంటున్నారు.

ప్రోత్సాహం అందించాలి



మిమిక్రీ ఒక ప్రత్యేక కళగా గుర్తించి కళాకారులకు తగిన ప్రోత్సాహాన్ని అందించాలి. నేటి యువత దీనిపై ఆసక్తి కనబరచాలి. సరైన సాధన చేస్తే ఈ రంగంలో అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. భవిష్యత్తులో అమరావతిలో మిమిక్రీ క్లబ్‌ను ఏర్పాటు చేసి, చిన్నారులకు శిక్షణ అందేలా కృషి చేస్తా.

- కాసుల కృష్ణంరాజు, మిమిక్రీ కళాకారుడు, గుంటూరు

సరైన సాధన లేకపోతే ఈ రంగంలో రాణించలేరు..



నిత్య సాధన అవసరం. ఎప్పటికప్పుడు వైవిధ్యాన్ని ప్రదర్శించాలి. అప్పుడే ఈ రంగంలో మంచి అవకాశాలు వస్తాయి. నేటి తరం దీనిపై ఆసక్తి కనబరచకపోవడం దురదృష్టకరం. ప్రభుత్వం కూడా కళాకారులను ప్రోత్సహించాలి. దేశ విదేశాల్లో మిమిక్రీకి గుర్తింపు ఇవ్వాలనే లక్ష్యంతో పనిచేస్తున్నాను.

- మిమిక్రీ శివ, గుంటూరు

ఎస్సీ జనాభాపై సోషల్ ఆడిట్

- గ్రామ, వార్డు సచివాలయాల్లో వివరాల ప్రదర్శన
- నెలాఖరు వరకు అభ్యంతరాల స్వీకారం
- జనవరి 10న కులగణన తుది వివరాల విడుదల

గుంటూరు, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎస్సీల కులగణన ప్రారంభమైంది. అన్ని గ్రామ, వార్డు సచివాలయాల్లో వాటి పరిధిలో నివాసం ఉంటున్న ఎస్సీల వివరాలను నోటీసు బోర్డుల్లో సిబ్బంది ప్రదర్శించారు. ఎస్సీల జనాభాపై సోషల్ ఆడిట్(సామాజిక తనిఖీ) నిర్వహించాలన్న ప్రభుత్వ నిర్ణయం మేరకు అవసరమైన చర్యలు చేపట్టామని గుంటూరు కలెక్టర్ నాగలక్ష్మి తెలిపారు. సచివాలయాల పరిధిలో నివాసం ఉంటున్న ఎస్సీలు ఆయా కార్యాలయాలకు వెళ్లి వారి వివరాలు సరిగా ఉన్నాయో, లేదో సరిచూసుకోవాలని సూచించారు. నోటీసు బోర్డుల్లో ప్రదర్శించిన వివరాలపై అభ్యంతరాలుంటే ఈ నెల 31 లోపు సంబంధిత గ్రామ/వార్డు సచివాలయంలో అందజేయాలని సూచించారు. అభ్యంతరాలను జనవరి ఒకటో తేదీ నుంచి 6 వరకు క్షేత్రస్థాయిలో పరిశీలించి సమగ్ర వివరాలను సేకరించిన అనంతరం 10న కులగణన తుది వివరాలను ప్రదర్శిస్తామన్నారు.

మూడు దశల్లో తనిఖీలు..

కులగణనపై మూడు దశల్లో తనిఖీలు నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించింది. పేరు, ఆధార్ నంబరు, పుట్టిన తేదీ, వయస్సు, ఉపకులం, మరుగుదొడ్డి, తాగునీటి సౌకర్యాలు, విద్యార్హత, వృత్తి, వ్యవసాయం తదితర వివరాలను సచివాలయాల్లో ప్రదర్శిస్తారు. వాటిని క్షుణ్ణంగా పరిశీలించుకుని అభ్యంతరాలను సచివాలయంలో వీఆర్‌వోకి అందజేయాల్సి ఉంటుంది. ఆ వివరాలను వీఆర్‌వో సంబంధిత మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌కు సమర్పిస్తారు. వీటిని ఆర్‌ఐ పునర్ పరిశీలన చేసిన తర్వాత తహసీల్దారుకు సిఫార్సు చేస్తారు. అనంతరం తహసీల్దారు తనకు అందిన వీఆర్‌వో, ఆర్‌ఐల నివేదికను పోర్టల్‌లో పొందుపరుస్తారు. ఇలా పొందుపరిచిన వివరాల్లో ఖచ్చితత్వాన్ని పెంపొందించేందుకు జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ సహాయ అధికారులతో 50 మంది వివరాలను ర్యాండమ్‌గా తనిఖీ చేయిస్తారు. సోషల్ ఆడిట్‌ని కలెక్టర్, సబ్ కలెక్టర్, ఆర్‌డీవో, సాంఘిక సంక్షేమ శాఖ జిల్లా అధికారి సహకారంతో పర్యవేక్షిస్తారు. ఈ దృష్ట్యా జిల్లాలోని ఎస్సీలంతా వచ్చే మంగళవారం సాయంత్రంలోపు వీలు చూసుకుని సచివాలయానికి వెళ్లి వారి వివరాలు సక్రమంగా పొందుపరిచారో, లేదో సరిచూసుకోవాలి.

ఎస్సీ కులాల ఉపవర్గీకరణకు ఇదే ప్రామాణికం

కాగా కూటమి ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు ఎస్సీ కులాల ఉపవర్గీకరణ ప్రక్రియని ప్రారంభించిన విషయం తెలిసిందే. ఇప్పటికే ఏకసభ్య కమిషన్‌ని విశ్రాంత ఐఏఎస్ అధికారి రాజీవ్‌రంజన్ మిశ్రాతో ఏర్పాటు చేసింది. ఆయన ఈ నెల 30న గుంటూరు జిల్లా పర్యటనకు రానున్నారు. ఈ నేపథ్యంలో కులగణని సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ కులగణన ఆధారంగానే ఎస్సీ వర్గీకరణ జరగనున్నది.



సచివాలయంలో ప్రదర్శించిన ఎస్సీ జనాభా వివరాలు

ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంలో నిత్యనూతన విద్యార్థిగా ఉండాలి

- నైపుణ్యాలే ఉద్యోగ,ఉపాధి అవకాశాలకు తొలిమెట్టు
- టీసీఎస్ సీనియర్ కన్సల్టెంట్ ఎంఎస్ఆర్ మూర్తి
- అట్టహాసంగా ప్రారంభమైన ఆర్వీఆర్అండ్‌జేసీ కొలరిడో ఫెస్ట్

గుంటూరు(విద్య),డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): నిత్యం మారుతున్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా అందిపుచ్చుకుని యువత నిత్య విద్యార్థిగా ముందుకు సాగాలని, చదువుతోపాటు నైపుణ్యాలు, భావ వ్యక్తీకరణ ఎంతో అవసరమని టీసీఎస్ సీనియర్ కన్సల్‌టెంట్ ఎంఎస్‌ఆర్ మూర్తి ఉద్బోధించారు. చౌడవరంలోని ఆర్‌వీఆర్ అండ్ జేసీ ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం కొలరిడో-2024 జాతీయ ఫెస్ట్ ప్రారంభం సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమానికి కళాశాల చైర్మన్ డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. ఎంఎస్‌ఆర్ మూర్తి మాట్లాడుతూ ప్రస్తుతం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఉద్యోగ ఉపాధి అవకాశాల్లో కొత్త పుంతలు తొక్కుతోందని అందుకనుగుణంగా యువత తమ నైపుణ్యాలను మరింతగా పెంచుకోవాలన్నారు.

యువతలో జోష్ నింపిన వేడుకలు

జాతీయ కొలరిడో ఉత్సవాల్లో ఎల్‌వైఎఫ్(లవ్ యువర్ ఫాదర్) సినీ బృందం కళాశాలలో సందడి చేసింది. సినీ తారలు శ్రీహర్ష, కశికా కపూర్ బృందం విద్యార్థుల్లో జోష్ నింపారు. అంతేకాకుండా కళాశాల విద్యార్థిని, విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతి కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి రాయపాటి గోపాలకృష్ణ, ప్రిన్సిపల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్, డైరెక్టర్ ఆర్ అండ్ డి డాక్టర్ కొమ్మినేని రవీంద్ర డైరెక్టర్ ఫైనాన్స్ అండ్ అడ్మినిస్ట్రేషన్ డాక్టర్ నార్నే శ్రీనివాసరావు తదితరులు వేడుకల్లో పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంఎస్ఆర్ మూర్తి



సినీ తారలు శ్రీహర్ష, కశికా కపూర్ నృత్యాలు



విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు

ఐదుగురికి.. రూ.వెయ్యి కోట్ల భూములు

- పొన్నూరు పట్టణ పరిధిలో భూ మాయ

(5వ పేజీ తరువాయి..)

ఉంటారా అనేది తెలియాలి.

- అధికారులు చెబుతున్నట్లు నోషనల్ ఖాతా అంటే దానిలో ఉన్న 70కిపైగా సర్వే నంబర్లలో పట్టాదారుడి పేరు ఒకరిదే ఉండకూడదు. ఇక్కడ ఒక ఖాతాకు ఒకరి పేరే అన్ని సర్వే నంబర్లకూ ఉండటం కుంభకోణానికి పాల్పడ్డారనే అనుమానాలకు బలం చేకూర్చుతుంది.
- తాత్కాలిక ఖాతా అయినా, శాశ్వత ఖాతా అయినా, దానిలో ఒక పేరుపైనే అన్ని సర్వే నంబర్లు ఉండటం, పైగా వాటన్నిటినీ ఒకే తేదీతో మ్యుటేషన్ ఆమోదించడం కూడా అనుమానం కలిగిస్తున్నది.
- వెబ్‌ల్యాండ్ సాఫ్ట్‌వేర్ ద్వారా మార్పులు చెయ్యాలంటే ఖచ్చితంగా తహసీల్దారుకు తెలియకుండా జరగదు. ఒకవేళ కిందిస్థాయి సిబ్బంది మార్పులు చేశారనుకున్నా, ఒకటి, రెండు సర్వే నంబర్లు మినహా ఒకేసారి 70కిపైగా నంబర్లను మార్చలేరు. మార్చినా తహసీల్దారుకు తెలిసిపోతుంది.
- ఆ భూములను చూపించి ఎవరో పేరుతో భారీగా రుణాలు దోచేసిన పరిస్థితుల వంటివి ఏమైనా ఉన్నాయా! అనేదికూడా పరిశీలించాల్సిన అంశమే.
- విలువైన భూములను రికార్డుల్లోకి ఎక్కించేటపుడు ఎంతో జాగ్రత్తగా ఉండాల్సి ఉన్నా, అధికారులు పూర్తి నిర్లక్ష్యంతోనో, లేక నేతలు చెప్పినట్లో మార్చేశారనేది వస్తున్న విమర్శ.
- ఒకవేళ పొరపాటుగా జరిగినా, అక్కడక్కడ ఖాతా నంబర్లలో పొరపాట్లు జరగడం సహజం. కానీ ఇక్కడ వరుస ఖాతా నంబర్లను చూస్తే ఉద్దేశపూర్వకంగానే చేశారనేది సీనియర్ అధికారుల అనుమానం.
- నోషనల్ ఖాతాలంటే ఆ నంబరు ఆరు అంకెల్లో ఉంటుంది. కానీ నాలుగు అంకెల్లో ఉన్న ఖాతాలను నోషనల్ ఖాతాలని అధికారులే చెప్పడం చూస్తే ఇందులో ఏదో మతలబు ఉందని తెలుస్తోంది. నోషనల్ పేరుతో తప్పుదారి పట్టించే ప్రయత్నం కూడా అనుమానాలకు బలం చేకూర్చుతోంది.

మామూళ్ల దోపిడీ

ఈ భూమాయ విషయంలో భూ హక్కుదారులను రెవెన్యూ సిబ్బంది తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారు. తమ భూమి ఎవరి ఖాతాలోనో నమోదైందని తెలుసుకున్న యజమానులు మార్పుల కోసం అర్జీలు పెట్టుకుంటే, వారి భూమి విస్తీర్ణం, ధరను బట్టి రూ.10 లక్షల వరకు మామూళ్లు డిమాండ్ చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. వారు అడిగినంత ఇవ్వకుంటే రోజుల తరబడి తిప్పుతున్నారని బాధితులు చెబుతున్నారు. సచివాలయం ద్వారా అర్జీ పెట్టుకుంటే, దానిపై తహసీల్దారు తర్వాత స్థానంలో ఉన్న అధికారి సంతకం ఉంటే కానీ అది ఆన్‌లైన్‌లోకి రావడంలేదు. సంబంధిత అధికారిని కలిసి, ఆయన అనుమతి తీసుకొస్తే దరఖాస్తు ఆన్‌లైన్ అవుతుందని కొన్ని సచివాలయాల్లోని సిబ్బంది బహిరంగంగానే చెబుతున్నారంటే దోపిడీ ఎంత పగడ్బందీగా జరుగుతుందో అర్థమవుతుంది. ప్రధానంగా ఇద్దరు అధికారులు ఈ వ్యవహారంలో పీడించిమరీ వసూళ్లకు పాల్పడుతుంటే, బాధితులు ఎమ్మెల్యే దూళిపాళ్ల నరేంద్రకు మార్‌కు ఇటీవల ఫిర్యాదు చేశారు. దీంతో ఆయన ఇటీవల తహసీల్దారు కార్యాలయానికి వెళ్లి ఆ అధికారులను తీవ్రస్థాయిలో హెచ్చరించినట్లు సమాచారం. అయినా వారిలో మాత్రం మార్పు లేదని తెలుస్తోంది.

పరిశీలించి సరిచేస్తాం

ఆ ఖాతాలు 2016లో మార్పులు జరిగిపోయినవి. అప్పట్లో హక్కుదారులు రాకపోవడంతో వాటిని తాత్కాలిక ఖాతాల కింద నోషనల్ అకౌంట్‌లో నమోదు చేశాం. ఎవరైనా తమ సర్వే నంబర్లు మారాయని వస్తే, వారి పత్రాలు పరిశీలించి మార్పులు చేస్తాం. ఇందుకు ఎవరూ డబ్బులు డిమాండ్ చెయ్యరు. ఒకవేళ చేసినా ఇవ్వాల్సిన పనిలేదు. నా దృష్టికి తీసుకువస్తే చర్యలు తీసుకుంటా. మొత్తం ఖాతాలను పరిశీలించి, పొరపాటు ఎక్కడ జరిగిందో చూసి త్వరలోనే సరిచేస్తాం.

- జియావుల్‌హక్, తహసీల్దారు పొన్నూరు

డిఫెన్స్ లిక్కర్.. జార్ఖండ్ నుంచి గుంటూరుకు

- ఇద్దరు నిందితుల అరెస్టు, 70 మద్యం బాటిళ్ల సీజ్

గుంటూరు(కార్పొరేషన్), డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): జార్ఖండ్ రాష్ట్రం నుంచి గుంటూరుకు డిఫెన్స్ లిక్కర్ తీసుకొచ్చి అమ్ముతున్న ఇద్దర్ని అరెస్టు చేసినట్లు గుంటూరు టూ టౌన్ ఎక్సైజ్ సీఐ వై యశోదరాదేవి తెలిపారు. శుక్రవారం స్థానిక స్టేషన్‌లో నిందితులను మీడియా ఎదుట హాజరుపరిచి వివరాలు తెలిపారు. చేబ్రోలు మండలం వడ్లమూడి గ్రామానికి చెందిన బాలాజీబాబు సింహాద్రి, బోలగాని వెంకటేశ్వరరావు జార్ఖండ్ నుంచి డిఫెన్స్ లిక్కర్ తీసుకొచ్చి గుంటూరు పరిసర ప్రాంతాల్లో అధిక ధరలకు విక్రయిస్తున్నారు. ఎక్సైజ్ అధికారులకు అందిన సమాచారం మేరకు చుట్టుగుంట వీఐపీ రోడ్డు చివర సింహాద్రి, వెంకటేశ్వరరావులను అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద డిఫెన్స్ లిక్కర్ బాటిళ్లు 70 ఉండటాన్ని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. వారిని అరెస్టు చేసి వారి నుంచి రెండు సెల్‌ఫోన్లు, ఓ ఆటోను స్వాధీనం చేసుకున్నారు. ఈ సమావేశంలో ఏఈఎస్ ఈడే మారయ్యబాబు, ఎస్‌ఐ సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.



మద్యాన్ని స్వాధీనపరుచుకుని నిందితులను అరెస్టు చేసిన సీఐ యశోదరదేవి, ఏఈ మారయ్య

ఆర్వీఆర్‌జేసీలో.. సకుటుంబనామ్ సందడి



సకుటుంబ నామ్ చిత్ర బృందం సభ్యులు

గుంటూరు(విద్య), డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్‌వీఆర్‌జేసీ ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం 'సకుటుంబ నామ్' చిత్ర బృందం సందడి చేసింది. చిత్ర కథా నాయకుడు రామ్ కిరణ్, దర్శకుడు ఉదయ్ శర్మ మాట్లాడుతూ కొత్త కథ అంశంతో కుటుంబ సభ్యులందరూ కలిసి చూసేలా సినిమాను రూపొందించామన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్ ఆఫ్ ఫొటోగ్రఫీ మధు దాసరి, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ రోహిత్, నటులు నవీన్ జీపీ, రచ్చరవి, నిత్య, సిమ్మి, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సంస్కరణల యోధుడు మన్మోహన్‌సింగ్

- రాజీవ్‌గాంధీ భవన్‌లో పలువురు నేతల నివాళులు

గుంటూరు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఒడిదుడుకులతో తల్లడిల్లుతోన్న సమయంలో ఆర్థిక సరళీకృత విధానాలతో దేశ ఆర్థికాభివృద్ధికి బాటలు వేసిన గొప్ప సంస్కరణల యోధుడు డాక్టర్ మన్మోహన్‌సింగ్ అని పలువురు నేతలు కొనియాడారు. రాజీవ్‌గాంధీభవన్‌లో మాజీ ఎమ్మెల్యే లింగంశెట్టి ఈశ్వరరావు, డీసీసీ అధ్యక్షుడు చిలకా విజయ్‌కుమార్‌ల ఆధ్వర్యంలో పలు రాజకీయ, ప్రజా సంఘాల నాయకులతో మాజీ ప్రధాని దివంగత డాక్టర్ మన్మోహన్‌సింగ్ సంస్మరణ సభ శుక్రవారం జరిగింది. మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ 2004 నుంచి 2014 వరకు ప్రధానిగా మన్మోహన్‌సింగ్ చేసిన సంస్కరణలతో దేశ ఆర్థిక పరపుష్టతకు బాటలు పడ్డాయన్నారు. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులతో దేశ ఆర్థిక రంగాన్ని పరుగులు పెట్టించారన్నారు. పనికి ఆహార పథకం, సమాచార హక్కు చట్టం మన్మోహన్ సింగ్ తీసుకువచ్చారన్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్, మాజీ ఎమ్మెల్యే షేక్ మస్తాన్‌వలి, జనచైతన్య వేదిక అధ్యక్షుడు వి లక్ష్మణరెడ్డి, కొరివి వినయ్‌కుమార్, గడ్డం పాల్ విజయ్‌కుమార్, వాసు, జయసుధ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజీవ్‌గాంధీభవన్‌లో జాతీయ పతాకాన్ని అవనతం చేసి జోహార్ మన్మోహన్‌సింగ్ అంటూ నాయకులు నివాళులర్పించారు.



మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డొక్కా లింగంశెట్టి, మస్తాన్‌వలి, విజయ్‌కుమార్ తదితరులు

నిర్లక్ష్యపు నీడలో కాకతీయ శాసనాలు

- రొంపిచర్ల చారిత్రక ఆనవాళ్లను కాపాడాలి
- పురావస్తు పరిశోధకుడు ఈమని శివనాగిరెడ్డి



శాసనాలు, శిల్పాలను పరిశీలిస్తున్న ఈమని శివనాగిరెడ్డి

విజయవాడ కల్చరల్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా రొంపిచర్ల గ్రామ శివారులోని వేణుగోపాలస్వామి దేవాలయానికి వెళ్లే దారిలో నిర్లక్ష్యానికి గురైన క్రీ.శ. 10-13 శతాబ్దాల నాటి శిల్పాలు, శాసనాలను భద్రపరిచి, కాపాడుకోవాలని పురావస్తు పరిశోధకుడు, ప్లీచ్ ఇండియా సీఈఓ డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి విజ్ఞప్తి చేశారు. వారసత్వ సంపదను గుర్తించి, పరిరక్షించడానికి చేపట్టిన అవగాహన కార్యక్రమంలో భాగంగా ఆయన శుక్రవారం రొంపిచర్లలో పర్యటించి పలు చారిత్రక ఆనవాళ్లను గుర్తించారు. గ్రామ వెలుపల, వినాయక ఆలయం ముందు రోడ్డుపై, మదన గోపాల దేవాలయానికి వెళ్లే దారిలో, క్రీ.శ 10వ శతాబ్దానికి చెందిన మహిషాసురమర్దిని, బ్రహ్మ, కుమారస్వామి, భైరవ, నంది విగ్రహాలు, ఇంకా కాకతీయ గణపతి దేవుడు, ప్రతాపరుద్రుడు విడుదల చేసిన రాతి శాసనాలు అలనా పాలనా లేక గడ్డి, గాదం మధ్య పడివున్నాయన్నారు. గణపతి దేవుని శాసనంలో స్థానిక కేశవ దేవునికి, క్రీ.శ.1320 నాటి ప్రతాపరుద్రుని శాసనంలో స్థానిక అనంత గోపీనాథ దేవుని అమావాస్య కొలువులకు రెడ్ల చెరువు వెనక కొంత భూమిని దానం చేసిన వివరాలు, అలాగే క్రీ.శ. 1245 నాటి కోట భీమరాజు మంత్రి వల్లభుడు, రొంపిచర్లలో కట్టించిన గోపీనాథ ఆలయానికి కొంత భూమిని దానం చేసిన వివరాలు వున్నాయని ఆయన చెప్పారు. రొంపిచర్ల గ్రామ చరిత్రకు సాక్ష్యాలైన ఈ శిల్పాలు, శాసనాలను కాపాడి, భవిష్యత్ తరాలకు అందించాలని శివనాగిరెడ్డి గ్రామస్తులకు, ఆలయ అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో గట్టుప్పల్ శ్రీనివాస్ పద్మ వంశీ, స్థపతి బి.వెంకటరెడ్డి పాల్గొన్నారు.



శాసనాన్ని పరిశీలిస్తున్న ఈమని శివనాగిరెడ్డి తదితరులు

నిరాదరణ కారణంగా శబరిమల ప్రత్యేక రైళ్ల రద్దు

గుంటూరు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల నిరాదరణ కారణంగా జనవరి నెలలో పలు శబరిమల ప్రత్యేక రైళ్లను రద్దు చేసినట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో ఏ.శ్రీధర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జనవరి 24న నంబరు. 07167 మౌలాలి - కొట్టాయం, 25న నంబరు. 07168 కొట్టాయం - మౌలాలి, 07171 మౌలాలి - కొట్టాయం, 26న నంబరు. 07169 కాచీగూడ - కొట్టాయం, 27న నంబరు. 07172 కొల్లం - మౌలాలి, నంబరు. 07170 కొట్టాయం - కాచీగూడ, 07157 నరసపూర్ - కొల్లం, 28న నంబరు. 07065 హైదరాబాద్ - కొట్టాయం, 29న నంబరు. 07158 కొల్లం - నరసపూర్, నంబరు. 07066 కొట్టాయం - సికింద్రాబాద్, 31న నంబరు. 07167 మౌలాలి - కొట్టాయం, ఫిబ్రవరి 1న నంబరు. 07168 కొట్టాయం - మౌలాలి రైళ్లను రద్దు చేశామన్నారు. ఈ విషయాన్ని యాత్రికులు గమనించాలని సీపీఆర్‌వో విజ్ఞప్తి చేశారు.

మార్చి నెలాఖరు వరకు పలు ప్రత్యేక రైళ్ల సేవల పొడిగింపు

గుంటూరు మీదగా ప్రయాణిస్తున్న పలు ప్రత్యేక రైళ్ల సేవలను మార్చి నెలాఖరు వరకు పొడిగించినట్లు సీపీఆర్‌వో శ్రీధర్ తెలిపారు. సికింద్రాబాద్ - రామనాథపురం - సికింద్రాబాద్, నాందేడ్ - ఈరోడ్ - నాందేడ్, కాచీగూడ - నాగర్‌కోయిల్ - కాచీగూడ, కాకినాడ టౌన్ - లింగంపల్లి - కాకినాడ(ట్రైవీక్లీ), హైదరాబాద్ - కటక్ - హైదరాబాద్ ప్రత్యేక రైళ్లను మార్చి వరకు పొడిగించినట్లు పేర్కొన్నారు.

ఉద్యోగ మేళాలో 10 మందికి ఉద్యోగాలు

చిలకలూరిపేట, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక రాగన్నపాలెం కమ్యూనిటీ హాల్‌లో ఉద్యోగ మేళ నిర్వహించారు. రెండు కంపెనీల ప్రతినిధులు హాజరయ్యారు. 16మంది నిరుద్యోగులు ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. పదిమంది ఉద్యోగాలకు ఎంపికయ్యారని జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి ఈ తమ్మాజీరావు తెలిపారు. సీడాప్ ప్లేస్మెంట్ అధికారి నాగుల్ పర్యవేక్షించారు. చిలకలూరిపేట స్కిల్‌హబ్ కోఆర్డినేటర్ జె.సురేష్, ఏ రమ్య పాల్గొన్నారు.

మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్‌కు ఘన నివాళి

వినుకొండ, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): దేశంలో ఆర్థిక సంస్కరణలను ప్రవేశపెట్టి పెట్టించడం, ఆ ఫలాలు ప్రజలకు చేరవేయడంలో మాజీ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ చెరగని ముద్ర వేశారని ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ నియోజకవర్గ శాసనసభ్యుడు జీవీ ఆంజనేయులు అన్నారు. ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా బారత్ పరుగులు తీస్తుందంటే అందుకు బీజం వేసింది మన్మోహన్‌సింగ్ అన్నారు. ఆయన మరణం భారతదేశానికి తీరని లోటు అని శుక్రవారం జీవీ ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. పంజాబ్, డిల్లీ విశ్వవిద్యాలయాల్లో ఆర్థిక పాఠాలు చెప్పే స్థాయి నుంచి మితబాషి మృదుభాషిగానే అద్భుతాలు సాధించిన మన్మోహన్‌సింగ్ జీవితాంతం నేటి తరానికి ఆదర్శనీయమని కొనియాడారు.



మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉద్యోగ సంఘం నాయకులు

మాజీ మంత్రి కాసు సంతాపం

నరసరావుపేట టౌన్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతికి మాజీ మంత్రి కాసు వెంకట కృష్ణారెడ్డి శుక్రవారం సంతాపం తెలియజేశారు. భారత ఆర్థిక వ్యవస్థలో పెను మార్పులు తీసుకువచ్చిన గొప్ప వ్యక్తి అన్నారు. రెండు సార్లు ప్రధానిగా, ఆర్థికమంత్రిగా దేశానికి ఎంతోసేవ చేశారన్నారు. ప్రపంచం ఆర్థికవేత్తలలో మన్మోహన్‌సింగ్ ఒకరన్నారు. మన్మోహన్‌సింగ్ ఎంతో నిజాయితీ, నిరాడంబర జీవితాన్ని గడిపారన్నారు. 1991 ఆర్థిక సంస్కరణల కారణంగా ఐటీ, మాన్యుఫాక్చరింగ్, టెలీకమ్యూనికేషన్ రంగాలలో యువతకు ఉపాధి దొరికిందన్నారు. మన్మోహన్‌సింగ్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

● నరసరావుపేట టౌన్: స్థానిక కేసానుపల్లిలో మేదరమెట్ల అంజమ్మ మస్తానరావు మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్‌సింగ్ మృతికి సంతాపం తెలియజేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా కళాశాల ఛైర్మన్ మేదరమెట్ల రామశేషగిరి రావు మాట్లాడుతూ ఒక ఆర్థికవేత్తగా, అధ్యాపకుడిగా, రిజర్వుబ్యాంక్ గవర్నర్‌గా, రాజ్యసభ సభ్యుడిగా, ప్రతిపక్ష నాయకుడిగా, ప్రధానమంత్రిగా దేశానికి ఎనలేని సేవలు అందించాలని కొనియాడారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.రామారావు, డాక్టర్ రవిశంకర్, అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

● నరసరావుపేట కల్చరల్: భారత మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్‌సింగ్ మృతిపై ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం శుక్రవారం నివాళులర్పించారు. సంఘ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో తొలుత మన్మోహన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించి, భారత ఆర్థిక వ్యవస్థకు మన్మోహన్ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో పల్నాడు ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు స్వర్ణ చినరామిరెడ్డి, కార్యదర్శి చుక్కా వెంకటేశ్వర్లు, జాయింట్ సెక్రటరీ షేక్ బాజీ మస్తాన్, భరత్‌రాజు, షరీఫ్, యం.వెంకటేశ్వరరావు, పద్య కవి ఈవూరి వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● నరసరావుపేట టౌన్: భారత ప్రధానిగా మన్మోహన్‌సింగ్ దేశ ఆర్థిక ప్రగతిని పెంపొందించారని పట్టణ వినియోగదారుల సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు కుంచాల స్వామి శుక్రవారం అన్నారు. గ్రామీణ ఉపాధి పథకం ప్రవేశపెట్టిన మన్‌మోహన్‌సింగ్ లేని లోటు తీర్చలేనిదని చిరుమెళ్ళ లక్ష్మీనారాయణ అన్నారు.

● నాదెండ్ల: మండల పరిషత్ సమావేశంలో ఎంపీపీ తలతోటి రాణి, ఎంపీడీవో స్వరూపరాణి, ఏఈలు శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు, ఈవోపీఆర్‌డీ లక్ష్మీకుమారి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పించారు.

పది దూరవిద్య దరఖాస్తుకు గడువు పెంపు

నరసరావుపేట కల్చరల్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం నిర్వహించే పది, ఇంటర్మీడియట్ కోర్సుల ప్రవేశం కోసం తత్కాల్ అడ్మిషన్ల గడువు తేదీని ఈ నెల 31 వరకు పొడిగించినట్లు పల్నాడు జిల్లా విద్యాశాఖాధికారి ఎల్. చంద్రకళ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే మార్చిలో జరగనున్న పదో తరగతి పరీక్షల ఫీజు చెల్లించేందుకు ఈ నెల 27 నుంచి 10 జనవరి వరకు పొడిగించినట్లు తెలిపారు. దూరవిద్య ప్రవేశాలకు రూ.600, పదో తరగతి పరీక్ష ఫీజు కోసం రూ.1000 చెల్లించాలన్నారు.

ఖోఖో విజేత వాగ్దేవి డిగ్రీ కళాశాల

నరసరావుపేట టౌన్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఏఎన్‌యూ అంతర కళాశాలల ఖోఖో విజేతగా వాగ్దేవి డిగ్రీ కళాశాల నిలిచిందని ప్రిన్సిపాల్ కపిలవాయి రాజేంద్ర ప్రసాద్ శుక్రవారం తెలిపారు. గుంటూరు టీజేపీఎస్ కళాశాలలో డిసెంబరు 20 నుంచి 22వరకు జరిగిన అంతర కళాశాల పోటీలలో ఈ ఘనత సాధించారన్నారు. ఏఎన్‌యూ జట్టుకు ఎస్‌కే అల్మాస్ ఎంపికైందన్నారు. ఈ నెల 27నుంచి 30వరకు త్రివేండ్రంలో జరిగే సౌత్‌జోన్ అంతర విశ్వవిద్యాలయ పోటీలలో ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు.

కేజీబీవీకి గ్రైండర్ అందజేత

రొంపిచర్ల, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సంతగుడిపాడులోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంకు దాత గ్రైండర్‌ను అందజేశారు. కర్లకుంటకు చెందిన వడ్లమూడి వెంకట కిషోర్ శుక్రవారం ఈ గ్రైండర్‌ను అందించారు.

కోస్టల్ బ్యాంకులో వైద్య శిబిరం

నరసరావుపేట టౌన్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సత్తెనపల్లి రోడ్డులోని కోస్టల్ బ్యాంకు బ్రాంచ్‌లో వైద్యశిబిరం శుక్రవారం నిర్వహించారు. కోస్టల్ బ్యాంక్ 25 వసంతాలు పూర్తిచేసుకున్న సందర్భంగా బ్యాంక్ రజతోత్సవాన్ని ఘనంగా నిర్వహించినట్లు బ్రాంచ్ మేనేజర్ బీ చంద్రశేఖర్ తెలిపారు. నెల్లూరి సూపర్ స్పెషాలిటీ హాస్పటల్ వైద్యులు డాక్టర్ నెల్లూరి రమేష్ ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

నూజెండ్ల, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న వ్యక్తి మృతిచెందిన సంఘటన గురువారం రాత్రి చోటు చేసుకొంది. మండలంలోని చింతలచెరువు సమీపంలో మృత్యుంజాపురం నుంచి వినుకొండ వెళ్తున్న పాల ఆటో, వినుకొండ నుంచి కురిచేడు వెళ్తున్న ప్రకాశం జిల్లా కురిచేడుకు చెందిన ఉప్పలపాడు దుర్గారావు (34) ద్విచక్ర వాహనాన్ని ఈ నెల 23న ఢీకొంది. క్షతగాత్రుడిని నరసరావుపేట వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. దీనిపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు ఐనవోలు ఏఎస్‌ఐ కోటిరెడ్డి తెలిపారు.

వీడని మహిళ మృతి మిస్టరీ

ఈపూరు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన ఈపూరులోని మండల ప్రభుత్వ కార్యాలయాల వద్ద ఏడు మాసాల క్రితం ఒంటరిగా నివసిస్తున్న మహిళ అనుమానాస్పద మృతి మిస్టరీగానే మిగిలింది. గ్రామానికి చెందిన వెంకటరమణ భర్త ముత్తుతో కలిసి ఎంపీడీవో కార్యాలయం ఎదురుగా ఆర్‌అండ్‌బీ రోడ్డు పక్కన పూరింట్లో ఉండేది. పిల్లలు తమిళనాడు రాష్ట్రంలోని చెన్నైలో ఉంటున్నారు. భర్త మృతి చెందిన తరువాత వెంకట రమణ ఒంటరిగా ఉండేది. ఈ ఏడాది మేనెలలో ఆమె అనుమానాస్పద స్థితిలో మృతిచెందింది. మెడలో ఉండాల్సిన బంగారు నానుతాడుకోసమే అగంతకుడు ఆమెను చంపినట్లు మృతురాలు కొడుకు పోలీసులకు అప్పట్లో ఫిర్యాదు చేశాడు. ఈ నెల 24వ తేదీన ఈపూరులో వృద్ధురాలిని గాయపరిచి చనిపోయిందనుకొని మెడలో బంగారు నానుతాడు దొంగిలించిన సంఘటన ఇటీవల చోటుచేసుకుంది. ఈ కేసులో కేబుల్ ఆపరేటర్‌పై ఫిర్యాదు అందింది. ఈ రెండు కేసులను పోలీసులు పూర్తిస్థాయిలో విచారించి కేసు మిస్టరీని చేధించాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

లారీ ట్యాంకుల్లో 1100లీటర్ల డీజిల్ చోరీ

గంటవారిపాలెం (శావల్యాపురం) డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి పక్కన నిలిపిన నాలుగు లారీల ట్యాంకుల్లోని 1100 లీటర్ల డీజిల్‌ను గుర్తు తెలియని వ్యక్తులు చోరీచేసిన సంఘటన గుంటూరు-కర్నూలు జాతీయ రహదారి మార్గంలోని గంటవారిపాలెం, కృష్ణాపురం గ్రామాల సమీపంలో గురువారం రాత్రి జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు చెన్నా చంద్రశేఖర్ వినుకొండ నుంచి వరంగల్ వెళ్ళేందుకు గురువారం సాయంత్రం లోడు లారీతో బయలుదేరాడు. గంటవారిపాలెం అడ్డంకి బ్రాంచ్ కెనాల్ వద్దనున్న లక్ష్మీతిరుపతమ్మ దేవాలయం వద్ద జాతీయరహదారి పక్కన లారీని పార్క్ చేసి అదే గ్రామంలోని తన ఇంటికి వెళ్ళాడు. రాత్రి 11 నుంచి 12 గంటల సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు ఇన్నోవా కారులో వచ్చి లారీ ట్యాంక్‌లోని 400లీటర్ల డీజిల్‌ను అపహరించారు. శుక్రవారం ఉదయాన్నే డ్రైవర్ వచ్చి చూసేసరికి లారీ ట్యాంక్‌లో డీజిల్ లేకపోవడంతో యజమానికి సమాచారం అందించాడు. అదే మార్గంలోని కృష్ణాపురం గ్రామ సమీపంలోని నడికుడి శ్రీకాళహస్తి రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద నిలిపి ఉంచిన మూడు లారీల్లో కూడా గుర్తుతెలియని వ్యక్తులు 700లీటర్ల డీజిల్‌ను చోరీ చేసినట్లు లారీల డ్రైవర్లు వాపోయారు. చోరీచేసిన వ్యక్తుల వివరాల కోసం పలుచోట్ల అమర్చిన సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నారు. మరలా ఇలాంటి దొంగతనాలు పునరావృతం కాకుండా సీసీ కెమెరాలతో పటిష్ఠ నిఘా ఏర్పాటు చేయాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

అడ పిల్లలకు విద్య చాలా అవసరం: సీడీపీవో అరుణ

ఈపూరు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఆడపిల్లలు చదువుకోవడం వలన అన్ని రంగాలలో ముందుంటారని అప్పుడే సమాజం కూడా అభివృద్ధి చెందుతుందని సీడీపీవో అరుణ అన్నారు. ఈపూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో శుక్రవారం మండల స్థాయి కిశోర్ బాలికలకు శిక్షణ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో 10 నుంచి 19సంవత్సరాల వయస్సు కలిగిన బాలికలకు కిశోర్ వికాసం గురించి వివరించారు. కార్యక్రమంలో తహసీల్దారు నళిని, ఎంపీడీవో కే ప్రభాకర్, అడ్వైజర్ కే వాణిశ్రీ సూపర్‌వైజర్లు, అంగన్వాడీ కార్యకర్తలు, డ్వాక్రా సంఘాల మహిళలు పాల్గొన్నారు.

సచివాలయంలో కుల సర్వే జాబితాలు

ఈపూరు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండల పరిదిలోని అన్ని గ్రామాల్లోని షెడ్యూల కులాల సర్వే జాబితాలను సచివాలయాలలో ఉంచినట్లు తహసీల్దారు ఏ నళిని శుక్రవారం తెలిపారు. కులసర్వే జాబితాలో ఏమైనా అభ్యంతరాలు ఉంటే సంబంధిత వీఆర్వో లేక పంచాయితీ కార్యదర్శికి ఈ నెల 31వ తేదీలోపు తెలియపరచాలన్నారు. అభ్యంతరాలను పరిశీలించి విచారణ చేసి జనవరి 6వ తేదీకల్లాతుది జాబితా ప్రచురించడం జరుగుతుందన్నారు.

అయ్యప్పస్వామి దేవస్థానంలో బింగి రామమూర్తి సంస్మరణ సభ

చిలకలూరిపేట, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక అయ్యప్ప స్వామి దేవస్థానం అభివృద్ధికి, పట్టణ అభివృద్ధికి దివంగత మునిసిపల్ మాజీ మున్సిపల్ ఛైర్మన్ బింగి రామమూర్తి చేసిన సేవలు వెలకట్టలేనివని అయ్యప్పస్వామి దేవస్థానం ఆలయ కమిటీ ఛైర్మన్ వెల్లంపల్లి రవిశంకర్ శుక్రవారం అన్నారు. అయ్యప్ప స్వామి దేవస్థానంలో జరిగిన బింగి సంస్మరణ సభలో రవిశంకర్ ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో బింగి లక్ష్మీశివ నాగేశ్వరరావు, మల్లికార్జునరావు, శివకుమార్, గంజి పోలయ్య, కొత్త కోటేశ్వరరావు, సత్యనారాయణ, చిలకల రామలింగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు యడ్లపాడులో న్యాయ విజ్ఞాన సదస్సు

యడ్లపాడు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో చట్టాలు, న్యాయసాయంపై శనివారం యడ్లపాడులో న్యాయ విజ్ఞానసదస్సును నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్ కె నరేంద్రరెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ మహిళా చట్టాలు, దాడులు, వేధింపులు, మానవ అక్రమ రవాణా, వరకట్న వేధింపుల తదితర అంశాలపై ఈ సదస్సులో అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. యడ్లపాడులోని టీడీడీ కళ్యాణమండపంలో ఉదయం 11 గంటలకు ఈ సదస్సు జరుగుతుందన్నారు.

జగన్ నిర్వాకం వల్లే విద్యుత్ చార్జీల భారం: ప్రత్తిపాటి

చిలకలూరిపేట, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రజలపై పడిన విద్యుత్ చార్జీల భారం అంతా జగన్ అవినీతి, అత్యాశలో భాగమేనని మాజీమంత్రి, స్థానిక శాసన సభ్యుడు ప్రత్తిపాటి పుల్లారావు శుక్రవారం వెల్లడించారు. విలేకరులతో మాట్లాడుతూ 2023-2024లోనే జగన్ రూ.11వేల కోట్లు ప్రజల నుంచి దండుకోవడానికి ఏపీఈఆర్సీ అనుమతులు కోరాడన్నారు. ఐదేళ్లలో 10సార్లు విద్యుత్ చార్జీలు పెంచి, ప్రజల నడ్డివిరిచి రూ.32,166 కోట్లు వసూలు చేశారన్నారు. వైసీపీ పాలనలో విద్యుత్ రంగానికి, ప్రజలకు జగన్ చేసిన నష్టం అక్షరాలా రూ.1,29,503 కోట్లు అని ఆరోపించారు. జగన్ జమానాలో విద్యుత్ సంస్థల అప్పులే రూ.50వేల కోట్లకు పెరిగాయన్నారు. జగన్ పాలనలో విద్యుత్ వినియోగదారుల నుంచి వివిధ రకాల చార్జీలతో కలిపి రూ.32,166 కోట్లు ముక్కు పిండి వసూలు చేశారని వివరించారు. పీపీఏల రద్దు, సోలార్ విండ్ పవర్ పెట్టుబడిదారులపై బెదిరింపులకు పాల్పడిన జగన్ చర్యలతో ఆంధ్రప్రదేశ్ 10వేల మెగావాట్ల పునరుత్పాదక విద్యుత్ కోల్పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు.


కార్యకర్తలతో కలసి ర్యాలీగా విద్యుత్ సబ్‌స్టేషన్‌కు ర్యాలీగా వస్తున్న మాజీ ఎమ్మెల్యే బొల్లా, పార్టీ నాయకులు

పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలి

● వైసీపీ నేతల నిరసన

వినుకొండ టౌన్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): వైసీపీ రాష్ట్ర వ్యాప్త పిలుపు మేరకు పెరిగిన విద్యుత్ చార్జీలపై మాజీ ఎమ్మెల్యే బ్రహ్మనాయుడు ఆధ్వర్యంలో కరెంటు ఆఫీస్ వద్ద శుక్రవారం కార్యకర్తలతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. వైసీపీ పార్టీ కార్యాలయం నుంచి కరెంటు ఆఫీస్ వరకు కార్యకర్తలతో మాజీ ఎమ్మెల్యే బ్రహ్మనాయుడు పాదయాత్రతో కరెంటు ఆఫీస్ వద్దకు చేరుకుని నిరసన తెలిపారు. అనంతరం పార్టీ నాయకులతో కలిసి పట్టణ విద్యుత్ శాఖ ఏఈ పిచ్చియ్యకు వినతి పత్రం ఇచ్చి వెనుతిరిగారు. అనంతరం కార్యాలయం బయట మాజీ ఎమ్మెల్యే బ్రహ్మనాయుడు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలుపరచడంలో విఫలమయ్యారని విమర్శించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు యంయన్ ప్రసాద్, అమ్మిరెడ్డి అంజిరెడ్డి, బత్తుల చిన్నబ్బాయి, పగడాల వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే బ్రహ్మనాయుడు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అన్ని విధాలుగా ప్రజలను మోసం చేశారని, వైసీపీ కార్యకర్తలను కూటమి ప్రభుత్వం వేధిస్తోందని ఆరోపించారు.

● చిలకలూరిపేట, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ చార్జీల పెంపునకు వ్యతిరేకంగా మాజీమంత్రి విడదల రజిని ఆధ్వర్యంలో స్థానిక విద్యుత్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. రజిని గృహం వద్దనుంచి పార్టీ శ్రేణులు ర్యాలీగా వచ్చి నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం పార్టీ శ్రేణులతో కలిసి స్థానిక ఏడీఈ కి పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఆమె అందించారు.


చిలకలూరిపేటలో కార్యకర్తలతో కలిసి నిరసన తెలియజేస్తున్న మాజీ మంత్రి విడదల రజిని

● నరసరావుపేట రూరల్: విద్యుత్ చార్జీలను తగ్గించాలని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి డిమాండ్ చేశారు. నరసరావుపేట నియోజకవర్గం వైసీపీ ఆధ్వర్యంలో డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పోరుబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. గుంటూరు రోడ్డులోని వైసీపీ కార్యాలయం నుంచి విద్యుత్ శాఖ కార్యాలయం వరకు కార్యకర్తలతో కలిసి గోపిరెడ్డి ర్యాలీని నిర్వహించారు.


ఎక్సైజ్ సీఐ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేస్తున్న మహిళలు

బెల్టుషాపులు తొలగించాలంటూ నిరసన

వినుకొండ, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉప్పరపాలెంలో బెల్టు షాపులను అరికట్టాలని గ్రామానికి చెందిన మహిళలు సీపీఐ నాయకులతో కలిసి నరసరావుపేట రోడ్డులోని ఎక్సైజ్ కార్యాలయం వద్ద శుక్రవారం నిరసన తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ నియోకజవర్గ ఏరియా కార్యదర్శి బూదాల శ్రీనివాసరావు, సీపీఐ నాయకులు వందనం, దావీదు, రమణమ్మ, కాశమ్మ, పేరమ్మ, దుర్గమ్మలతోపాటు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఉప్పరపాలెంలో ఎక్సైజ్ అధికారుల తనిఖీలు

వినుకొండ టౌన్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉప్పరపాలెంలో అక్రమంగా మద్యం విక్రయాలు జరుగుతున్నట్లు మహిళలు ఎక్సైజ్ సీఐ శ్రీనివాసరావుకు ఫిర్యాదు ఇచ్చిన నేపథ్యంలో సీఐ ఆదేశాల మేరకు ఎక్సైజ్ ఎస్ఐ వినీల సిబ్బందితో గ్రామంలో తనిఖీలు నిర్వహించారు. ఎక్కడ మద్యం బాటిళ్ళు లభించలేదు. అనధికారి బెల్టుషాపులు కొనసాగిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

వివాహిత అనుమానాస్పద మృతి

నరసరావుపేట రూరల్, డిసెంబరు 27: (ఆంధ్రజ్యోతి): మండలంలోని గురవాయపాలెంలో వివాహిత అనుమానాస్పదంగా మృతి చెందింది. నరసరావుపేట రూరల్ ఎస్ఐ కిషోర్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని గురవాయపాలెంలో గర్నెపూడి అనిత, రమేష్ నివాసం ఉంటున్నారు. భార్యాభర్తల మధ్య గత కొంత కాలంగా వివాదాలు నడుస్తున్నాయి. వివాహేతర సంబంధం అనుమానంతో భార్య గర్నెపూడి అనితని (31) భర్త రమేష్ ఉరివేసి చంపాడని మృతురాలి తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. రమేష్‌ని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. వీరికి 8,6 సంవత్సరాల పాప, బాబు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నరసరావుపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

అంజమ్మకు ఎమ్మెల్యే అరవింద బాబు నివాళి

రొంపిచర్ల, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్టు మాజీ ఛైర్మన్ గడిపూడి నరసింహారావు భార్య గడిపూడి అంజమ్మ మృతి చెందారు. కాగా శుక్రవారం ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు ఆమె మృత దేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

ఈవీఎంల గోడౌన్‌లో కలెక్టర్ తనిఖీ

నరసరావుపేట రూరల్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ల గోడౌన్‌ను జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు తనిఖీ చేశారు. శుక్రవారం స్థానిక వ్యవసాయ మార్కెట్ ప్రాంగణంలోని ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్స్ గోడౌన్‌ను అంతర్గత తనిఖీలో భాగంగా జిల్లా కలెక్టర్ పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి మురళి, రెవెన్యూ డివిజనల్ అధికారి మధులత, తహసీల్దార్ తదితరులు పాల్గొన్నారు.